VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : గురువారం 16.07.2026
సంపుటి : 09 సంచిక : 37 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH www.velthuru.com




# ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ పునర్నిర్మాణానికి పునాది






- కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనం ప్రారంభించిన సీఎం
- చదువే భవిష్యత్తును, ఆత్మగౌరవాన్ని తీర్చిదిద్దుతుందని వ్యాఖ్య
- గత ప్రభుత్వం విద్యాశాఖను నిర్లక్ష్యం చేసిందని విమర్శ
- విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని వెల్లడించిన ముఖ్యమంత్రి
- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- విద్యలో తెలంగాణను దేశంలో తొలి రెండు స్థానాల్లో నిలపాలని పిలుపు
- ఆగస్టు 15లోగా 27.5 లక్షల మందికి యంగ్ ఇండియా కిట్లు పంపిణీ చేస్తామని వెల్లడి
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారూ అత్యున్నత స్థానాలకు చేరవచ్చని విద్యార్థులకు సూచన

కొత్తకోట వెలుతురు జూలై 15:

వనపర్తి జిల్లా కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు ఆత్మగౌరవాన్ని పెంచి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతుందని అన్నారు.గత ప్రభుత్వం విద్యాశాఖపై నిర్లక్ష్యం చూపిందని విమర్శించిన సీఎం, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాశాఖకు సీనియర్ అధికారులను నియమించామని తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని నమ్ముతున్నందునే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని చెప్పారు.కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అమరుల ఆశయాలకు గత ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదని, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

## సర్ ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే

- మీ ఓటును కాపాడుకోండి... మీ భవిష్యత్తును కాపాడుకోండి
- సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు... ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం
- ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం



## కేటీఆర్... ఇదీ ఫాం హౌస్ పాలనకు, ప్రజా పాలనకు తేడా...! ఇందిరమ్మ ఇండ్ల శీనన్న

- ప్రజల్లోకి వెళ్తూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్న కలెక్టర్లు, అధికారులను అభినందించిన మంత్రి ఇందిరమ్మ ఇండ్ల శీనన్న



## తెలంగాణ ఐటీ రంగంలో సరికొత్త సంచలనం

- 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో అమెజాన్ డేటా సెంటర్
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- రాష్ట్రంలో రూ.60,000 కోట్ల భారీ పెట్టుబడి!



## వేర్‌హౌసింగ్ సామర్థ్యాన్ని మరో 5 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతాం



- జిల్లాల వారీగా రానున్న 20 సంవత్సరాల గిడ్డంగుల అవసరాల మీద ఒక సంపూర్ణ అధ్యాయం చేయాలి.
- దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా గోదాముల నిర్మాణం చేపట్టాలి.
- గిడ్డంగులలో నిల్వ ఉంచిన సరుకు నాణ్యత ప్రమాణాలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన శాస్త్రీయ విధానాల అధ్యయనం చేయాలి.
- వడ్డీ భారాన్ని తగ్గించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి – ప్రభుత్వ కార్పొరేషన్లకు మంత్రి తుమ్మల సూచన

## దేశంలో ఎగిసిపడుతున్న ధరల మంట

- మోదీ వైఫల్యం వల్లే ఆర్థిక సంక్షోభం
- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- భారీగా పెరిగిన టోకు ధరల ద్రవ్యోల్బణం
- కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ ధ్వజం
- గత 44 నెలల్లోనే అత్యధిక స్థాయికి ధరలు
- మోదీ సమాధానం చెప్పాలన్న జైరాం రమేశ్
- రెట్టింపు కష్టాల్లో దేశ రైతాంగం
- మూడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన సాగు విస్తీర్ణం



ఢిల్లీ వెలుతురు జూలై 15:

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు, ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాల కారణంగా దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తోందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జూన్ నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం మునుపెన్నడూ లేని విధంగా భారీగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శల వర్షం కురిపించింది. దేశంలో నానాటికీ పెరిగిపోతున్న ధరల భారాన్ని నియంత్రించడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైందని, సామాన్యుడి బతుకును భారంగా మార్చిందని కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది.కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ ఆర్థిక సంక్షోభ పరిస్థితులపై సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్రంగా స్పందించారు. గత 44 నెలల కాలంలోనే టోకు ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పొడిగింపు




- ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ..
  ఆగస్టు 10న ముసాయిదా జాబితా విడుదల..
  సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలకు అవకాశం
- తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును పొడిగించిన కేంద్ర ఎన్నికల సంఘం.

## పాలమూరుకు శుభవార్త.. 90 టీఎంసీలకు అనుమతులే లక్ష్యం

- పాలమూరు ప్రాజెక్టుపై త్వరలో శుభవార్త.
- 90 టీఎంసీలకు అనుమతుల కోసం ప్రయత్నాలు.
- డిండి ప్రాజెక్టుపైనా చర్చలు కొనసాగుతున్నాయి.
- అమర రాజా కొత్త ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం.
- పాలమూరు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్న రేవంత్.
- స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని సూచన.



- ఈవీ రంగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలని ఆకాంక్ష.
- అమర రాజా ప్రపంచ స్థాయి సంస్థగా ప్రశంసలు.
- చైనాతో పోటీ పడే సంస్థగా కొనియాడిన సీఎం.

▶ మిగతా 2లో

## వరంగల్ ఎయిర్‌పోర్టు క్రెడిట్ మోదీదే.. రేవంత్‌కు కాదన్న రామచందర్‌రావు

- 2028 నాటికి నిర్మాణం పూర్తి లక్ష్యం..
  ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు కూడా రానుందని వెల్లడి
- 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యం.
- ఆ ప్రాజెక్టు క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని ఆరోపణ.



## తెలంగాణలో పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి: సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ లేఖ



- షాబాద్ ఘటనపై ఆందోళన.. పోక్సో కేసులకు నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేయాలని విజ్ఞప్తి

## చిన్న రైస్ మిల్లర్లను వేధించడం అన్యాయం ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఇవ్వాలి



- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



# ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ...

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల కొరత వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు.గతంలో పాలించిన వారు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని విమర్శిస్తూ, స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కృషితో ఈ పాఠశాలకు కొత్త భవనాలు, సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా విద్యా సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు.ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల సమస్యను ఇప్పటికే పరిష్కరించామని, ఇప్పుడు విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించామని చెప్పారు. ప్రస్తుతం విద్యలో తెలంగాణ దేశంలో 18వ స్థానంలో ఉందని, దానిని తొలి రెండు స్థానాల్లో నిలబెట్టడం మనందరి బాధ్యత అని అన్నారు.విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ATCs) అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో బ్లూ కాలర్ ఉద్యోగాలకు మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు.ఆగస్టు 15లోగా 27.5 లక్షల మంది విద్యార్థులకు యంగ్ ఇండియా కిట్ల పంపిణీ పూర్తి చేస్తామని సీఎం వెల్లడించారు. "ప్రభుత్వ పాఠశాలలో చదివితే ఏమవుతారని ఎవరైనా అడిగితే మీ రేవంతన్నను చూపించండి. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నాను" అని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. మైదానాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు.చివరగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోందని పేర్కొంటూ, విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.

## కేటీఆర్... ఇదీ ఫాం హౌస్ పాలనకు, ప్రజా పాలనకు తేడా...! - ఇందిరమ్మ ఇండ్ల శీనన్న

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

ప్రజలు నమ్మి ఓటేస్తే, గత పదేండ్లలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ గారు ఫాం హౌస్‌కే పరిమితమై, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి అనేక రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారు. యథా రాజా తథా వ్యవస్థ అన్నట్లుండేది అప్పటి పరిస్థితి.కానీ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి గారు, మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్లు, అధికారులు కూడా నిరంతరం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ సుపరిపాలన అందిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్తూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్న అధికారుల తీరు ప్రశంసనీయం.ఫాం హౌస్ నాయకత్వం కాకుండా, ప్రజల కోసం పనిచేసే నాయకత్వం ద్వారానే సుపరిపాలన సాధ్యమని నిరూపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఆదర్శంగా నిలుస్తోంది.

# దేశంలో ఎగిసిపడుతున్న ధరల మంట

(మొదటి పేజీ తరువాయి)

దేశాన్ని ఈ రకమైన ఆర్థిక వైఫల్యంలోకి నెట్టినందుకు ప్రధాని నరేంద్ర మోదీయే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దాదాపు 12 ఏళ్లుగా దేశాన్ని ఏలుతున్న మోదీ ప్రభుత్వం, ఈ ధరల పెరుగుదలపై దేశ ప్రజలకు తక్షణమే సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా నిలదీశారు.దేశానికి వెన్నెముక లాంటి వ్యవసాయ రంగం ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడిని, సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని జైరాం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల దేశంలో పంటల సాగు విస్తీర్ణం గత మూడేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. వ్యవసాయ పెట్టుబడి వ్యయాలు విపరీతంగా పెరగడం, మరోవైపు దిగుబడులు తగ్గడంతో రైతులు రెట్టింపు కష్టాలను అనుభవిస్తున్నారని, అన్నదాతను ఆదుకోవడంలో కేంద్రం చేతులెత్తేసిందని విమర్శించారు.దేశంలో ఇంధనం, విద్యుత్ ధరలు ఏకంగా 27.4 శాతం మేర పెరగడం వల్ల రవాణా రంగానికి, వస్తు ఉత్పత్తి వ్యయానికి భారీగా ఖర్చులు పెరిగాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. విద్యుత్, ఇంధన ధరల మోత కారణంగా దేశంలోని పరిశ్రమల నిర్వహణ భారం విపరీతంగా పెరిగిపోయిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కంపెనీల ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల, వ్యాపారులు ఆ భారాన్ని చివరకు సామాన్య వినియోగదారులపైనే నెడుతున్నారని, దీనివల్ల మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా తలకిందులైందని మండిపడ్డారు.దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని కీలక సూచీలు ప్రమాదకర స్థాయిని దాటి 'రెడ్ అలర్ట్' సంకేతాలను ఇస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఆర్థిక లోపాలను సరిదిద్దేందుకు ఎలాంటి సమర్థవంతమైన చర్యలు తీసుకోకుండా, ప్రజల దృష్టిని ఇతర అనవసర అంశాల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం పక్కదారి రాజకీయాలు చేస్తోందని జైరాం రమేశ్ ఆరోపించారు. పెరుగుతున్న ధరల అసలు గణాంకాలను దాచిపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం.. దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం మే నెలలో 9.68 శాతంగా నమోదు కాగా, అది జూన్ నెల నాటికి మరింత పెరిగి 9.87 శాతానికి చేరింది. మార్కెట్లో నిత్యావసర ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువుల ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోవడమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని ఆధార సంవత్సరంగా తీసుకుని కేంద్రం ఈ తాజా లెక్కలను అధికారికంగా ప్రకటించింది.ప్రకృతి పరంగా ఏర్పడిన 'ఎల్ నినో' ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గిందని, దీనివల్ల ఆహార పదార్థాల ఉత్పత్తి దారుణంగా పడిపోయిందని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఆహార కొరత కారణంగా మార్కెట్లో కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి.

# చిన్న రైస్ మిల్లర్లను వేధించడం అన్యాయం ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఇవ్వాలి

- **రైతులతో పాటు చిన్న రైస్ మిల్లర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శ.**
- **పెద్ద రైస్ మిల్లర్లకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆరోపణ.**
- **చిన్న మిల్లర్లపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన.**
- **వేల కోట్ల సీఎంఆర్ బకాయిలు ఉన్న పెద్ద మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్.**
- **చిన్న రైస్ మిల్లర్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు చిన్న రైస్ మిల్లర్లను కూడా వేధిస్తోందని విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్న పెద్ద రైస్ మిల్లర్లను వదిలిపెట్టి, లక్షల రూపాయల లెవీ బకాయిలు ఉన్న చిన్న రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.వేల కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) బకాయిలు ఎగ్గొట్టి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న పెద్ద రైస్ మిల్లర్ల నుంచి వెంటనే బకాయిలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో చిన్న రైస్ మిల్లర్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశం కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# సర్ ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే

**కరీంనగర్ వెలుతురు జూలై 15:**

రాష్ట్ర ప్రజలంతా తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(సర్) ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ''సర్ ను లైట్ తీసుకుంటే... మీ ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉంది''అని హెచ్చరించారు. సర్ ప్రక్రియను ఎవరూ లైట్ తీసుకోవద్దని కోరారు. 'మీ ఓటును కాపాడుకోండి... మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి'' అని పిలుపునిచ్చారు. బుధవారం రోజున కరీంనగర్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ''సర్'' ఫాంను నింపి చైతన్యపురిలోని సాధన స్కూల్ లో ఉన్న బీఎల్‌వో అధికారుల వద్దకు వెళ్లి సమర్పించారు. అక్కడే ఆన్‌లైన్లోనూ ఆ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ ఎలా కొనుసాగుతోంది? ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందరికీ పంపిణీ చేశారా? ఎంత మంది ఎన్యుమరేషన్ దరఖాస్తులను నింపి అందజేశారు? ఈ విషయంలో ఓటర్లు పడుతున్న ఇబ్బందులేమిటి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 24లోపు ఎన్యుమరేషన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం మంది ఓటర్లు మాత్రమే ఎన్యుమరేషన్ ఫాంలను అందజేశారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలంతా సర్ ప్రక్రియలో పాల్గొనాలి. ఈనెల 24 వరకు సమయం ఉందని నిర్లక్ష్యం చేయకండి! చివరి రోజు కోసం ఎదురుచూడకండి. ఈ రోజే ఎన్యుమరేషన్ ఫారమ్ నింపండి... మీ ఓటును కాపాడుకోండి. అట్లాగాకుండా 'నా దగ్గర ఓటర్ ఐడీ ఉంది... నాకు ఏమవుతుందిలే'' అని ఇంట్లో కూర్చుంటే... రేపు ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌కు వెళ్లిన తర్వాత ''లిస్టులో మీ పేరు గల్లంతవుతుంది. అందుకే చేతిలో ఓటర్ ఐడీ ఉంటే సరిపోదు... ఓటరు జాబితాలో పేరు ఉండాలి. అందులో భాగంగా బీఎల్ఓ మీ ఇంటికి వస్తే సహకరించండి. సర్ ఫారమ్ తీసుకోండి. వివరాలు సరిచూసుకోండి. ఫారమ్ నింపి గడువులోగా అందించండి.ముఖ్యంగా తెలంగాణ యువతను కోరుతున్నా... మీ ఫోన్‌లో గంటల తరబడి సోషల్ మీడియా చూస్తారు. రాజకీయాలపై పోస్టులు పెడతారు. ప్రభుత్వాలను తిడతారు. నాయకులను ప్రశ్నిస్తారు. కానీ మీ ఓటు లిస్టులో ఉందో లేదో ఒక్కసారైనా చూసుకున్నారా? ఓటే లేకపోతే... మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది? మీ ఇంట్లో అమ్మ ఓటు చూడండి. నాన్న ఓటు చూడండి. కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయో లేదో చూడండి.ఎందుకంటే ఓటు అంటే కాగితం ముక్క కాదు. ఓటు అంటే ప్రజల చేతిలో ఉన్న అధికారం. ఓటు అంటే ప్రశ్నించే హక్కుకు బలం. ఐదేళ్లు నాయకులు ప్రజల దగ్గరకు రాకపోయినా, ఎన్నికల రోజు మాత్రం ప్రజల దగ్గరకు రావాల్సిందే. ఎందుకు? మీ చేతిలో ఓటు ఉంది కాబట్టి. అలాంటి ఓటును నిర్లక్ష్యంతో పోగొట్టుకుంటారా? ఆలోచించాలని కోరుతున్నా. ఎవరో చూస్తారులే... BLO చూసుకుంటారులే... పార్టీ వాళ్లు చూసుకుంటారులే... అని వదిలేయొద్దు! మీ ఓటు బాధ్యత మీదే! ముఖ్యంగా ప్రతి యువకుడు ''నా కుటుంబంలో ఒక్క ఓటు కూడా పోనివ్వను'' అని సంకల్పంతో చేయాలి!సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు... ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం. ఈ రోజు సర్ ఫారమ్‌ను నిర్లక్ష్యం చేస్తే రేపు పోలింగ్ బూత్ దగ్గర పశ్చాత్తాపపడే పరిస్థితి రావచ్చు! మీ ఓటును కాపాడుకోండి...ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి.

## ఉమ్మడి నిజామాబాద్ అభివృద్ధికి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధి కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు మరో కీలక ముందడుగు వేశారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడంలో ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు.నిజామాబాద్ నగరంలోని తిలక్ గార్డెన్‌లో ఉన్న రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతుల కోసం రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆడిటోరియాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు మరింత అనుకూలంగా తీర్చిదిద్దనున్నారు.బాల్కొండ నియోజకవర్గంలోని ప్రసిద్ధ లింబాద్రి గుట్ట వద్ద టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయించారు. దీనివల్ల ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్ట టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.ఈ సందర్భంగా జిల్లా పార్టీ శ్రేణులు,నేతలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారికి, పర్యాటక శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు గారికి , ఇంచార్జ్ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన లక్ష్యమని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి కొనసాగిస్తానని పార్టీ నేతలు స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ.

# తెలంగాణ ఐటీ రంగంలో సరికొత్త సంచలనం

- **రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ఐటీ పెట్టుబడిగా రికార్డు**

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, ఐటీ రంగంలో సరికొత్త శకం మొదలైంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' తన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సరికొత్త డేటా సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట పరిధిలో ఉన్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో ఈ అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం వైభవంగా భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ చారిత్రాత్మక పారిశ్రామిక ఘట్టంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు పలువురు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, ఐటీ రంగ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అమెజాన్ సంస్థ రాబోయే పన్నెండేళ్ల (12 ఏళ్లు) వ్యవధిలో క్రమంగా తన వ్యాపార సామర్థ్యాన్ని విస్తరిస్తూ.. ఏకంగా రూ.60,000 కోట్ల భారీ పెట్టుబడులను తెలంగాణలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంత భారీ ఎత్తున ఒకే సాంకేతిక సంస్థ రాష్ట్రానికి రావడం తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఎత్తుకు తీసుకువెళ్లిందని, భవిష్యత్తులో ఈ భారీ పెట్టుబడి వల్ల రాష్ట్ర జీడీపీ గణనీయంగా పెరగనుందని అధికారులు వెల్లడించారు.అమెజాన్ డేటా సెంటర్ ప్రాజెక్ట్ అత్యంత వేగంగా కార్యరూపం దాల్చడానికి సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఈ భారీ ప్రాజెక్ట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం రెండు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 300 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ఏకంగా 202 ఎకరాల స్థలాన్ని, అలాగే చందన్‌వెల్లి పారిశ్రామిక ప్రాంతంలో మరో 98 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇప్పటికే అమెజాన్ సంస్థకు అధికారికంగా అప్పగించింది. ఈ కేటాయింపులతో హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయిలో అతిపెద్ద డేటా సెంటర్ల ప్రధాన కేంద్రంగా (హబ్) గుర్తింపు పొందింది.భూమిపూజ అనంతరం ఏర్పాటు చేసిన భారీ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మరిన్ని పెద్ద కంపెనీలను, పెట్టుబడులను సాదరంగా ఆహ్వానిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్ సమీపంలో నిర్మిస్తున్న ఈ ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యంత అధునాతన సాంకేతిక హరిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తమ ప్రభుత్వ ఆర్థిక వ్యూహాల్లో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీ మైలురాయిని, అదేవిధంగా 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ మొత్తం జీడీపీలో తెలంగాణ వాటా కనీసం 10 శాతం ఉండేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.రాష్ట్రానికి తరలివచ్చే అంతర్జాతీయ పరిశ్రమలు, ఐటీ కంపెనీలకు ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి జాప్యం లేకుండా పూర్తిగా పారదర్శకంగా ఒకే ఒక్క పద్ధతి ద్వారా (సింగిల్ విండో సిస్టమ్) అన్ని రకాల పారిశ్రామిక అనుమతులను కేవలం రోజుల్లోనే మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటును ప్రోత్సహిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం తరపున సుమారు రూ.125 కోట్ల విలువైన పన్ను రాయితీలు, మౌలిక వసతుల ప్రోత్సాహకాలను కూడా అందించామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలు పారిశ్రామికవేత్తల్లో గొప్ప నమ్మకాన్ని నింపాయన్నారు.ఫ్యూచర్ సిటీలో అమెజాన్ నిర్మిస్తున్న ఈ నూతన కేంద్రం కేవలం సాధారణ కార్యాలయం కాదని, ఇది దేశంలోనే అత్యంత భారీ వైశాల్యం గల 'హైపర్ స్కేల్ డేటా సెంటర్' గా అవతరించనుందని నిపుణులు తెలిపారు.

## పాలమూరుకు శుభవార్త.. 90 టీఎంసీలకు అనుమతులే లక్ష్యం

- **పరిశ్రమలు-సాగునీటితో పాలమూరు రూపురేఖలు మారతాయని వెల్లడి.**

**మహబూబ్‌నగర్ వెలుతురు జూలై 15:**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే శుభవార్త వినిపిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఒప్పించి అవసరమైన అనుమతులు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపుల అంశంపైనా సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గ్రూప్ ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూపీ) తయారీ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని డిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు వాటి సమస్యల పరిష్కారానికి పొరుగు రాష్ట్రంతో చర్చలు కొనసాగిస్తున్నామని చెప్పారు. అన్ని అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.విద్య, నీటిపారుదల, పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలతో పెట్టుబడులను ఆకర్షించే విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు.పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన పాలమూరు రైతుల త్యాగాన్ని గుర్తించాలని, అమర రాజా సంస్థ స్థానిక యువతకు ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో కాలుష్య రహిత రవాణా అవసరం పెరిగిందని, ఈవీ రంగంలో తెలంగాణ కీలక కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.అమర రాజా సంస్థ ప్రపంచ స్థాయి కంపెనీగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల సంస్థలతో పోటీ పడుతోందని రేవంత్ రెడ్డి కొనియాడారు. చైనా ఆధిపత్యం ఉన్న ఈవీ రంగంలో భారత సంస్థలు ముందుకు రావాలంటే అమర రాజా వంటి కంపెనీలను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

# వేర్‌హౌసింగ్ సామర్థ్యాన్ని మరో 5 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతాం

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

రాష్ట్రంలో రైతులకు శాస్త్రీయ గోదాముల సౌకర్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా వచ్చే రెండేళ్లలో ప్రస్తుతం ఉన్న సామర్థ్యానికి అదనంగా మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే వడ్డీ భారాన్ని తగ్గించుకుంటూ ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు.బుధవారం రోజున సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయా కార్పొరేషన్ల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితి, గోదాముల వినియోగం, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, ఆదాయ వృద్ధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు.మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 స్వంత గోదాములు ఉండగా వాటి మొత్తం నిల్వ సామర్థ్యం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. ప్రస్తుతం ఈ గోదాముల్లో 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదై 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఈజీ, ఇన్వెస్టర్ గోదాములు, అద్దె గోదాములతో కలిపి మొత్తం 524 గోదాములను ప్రస్తుతం వినియోగిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా గోదాముల సామర్థ్యాన్ని విస్తరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. దటి దశలో నిర్మిస్తున్న 17 గోదాములను 2027 జనవరి నాటికి పూర్తి చేసి సుమారు 2.12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రెండో దశలో 31 గోదాములను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మరో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని కల్పించనున్నట్లు వివరించారు. అదనంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరో 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వీటి ద్వారా మరో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మొత్తంగా రాష్ట్రంలో సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.కొత్తగా నిర్మించే ప్రతి గోదాముపై తప్పనిసరిగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గోదాముల అవసరాలకు కావలసిన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం సమకూర్చుకునే విధంగా రెడ్కో (REDCO) సంస్థతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులపై కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

- సీతారామ ప్రాజెక్టు ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్ తో చర్చించిన మంత్రి తుమ్మల
- నేడు ప్రాజెక్ట్ సందర్శన దృష్ట్యా సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసిన తుమ్మల

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకం తోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. నేడు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటంతో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ఈ న్యాయపరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సమన్వయంతో పనిచేస్తూ, కేంద్ర మంత్రులు, శాఖలు, అధికారుల వద్ద అన్ని విధాలుగా ప్రయత్నాలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభమై, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### దోమలవాగుపై నిల్వ సామర్థ్యం పెంపు ప్రతిపాదన

సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్–1, పంప్‌హౌస్–2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చించినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిల్వ సామర్థ్యం పెరిగితే ఎత్తిపోతల పథకం మరింత సమర్థవంతంగా పని చేస్తుందని, రెండు పంప్‌హౌస్‌ల మధ్య నీటి లభ్యత స్థిరంగా ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రతిపాదనకు నీటిపారుదల శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, కార్యరూపంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల వెల్లడించారు.



### ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటుపై చర్చ

సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్–1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు అంశంపైనా విస్తృతంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో అధిక వరద ప్రవాహం ఏర్పడినప్పుడు కాలువకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు, నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఈ రెగ్యులేటర్లు ఎంతో దోహదపడతాయని వివరించారు. కాలువ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడం, అధిక ప్రవాహాన్ని నియంత్రించడం లక్ష్యంగా అవసరమైన సాంకేతిక పరిశీలనలు చేపట్టాలని అధికారులను ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించినట్లు వివరించారు.

### యాతలకుంట సొరంగం పనులు 2026 ఆగస్టు నాటికి పూర్తి

సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2026 ఆగస్టు నాటికి లైనింగ్ పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సొరంగం పూర్తయితే సత్తుపల్లి ప్రాంత రైతాంగానికి సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సొరంగం నిర్మాణ బిల్లుల చెల్లింపులను త్వరగా విడుదల చేస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగితే నిర్మాణ సంస్థలు మరింత వేగంగా పనులు కొనసాగించే వీలుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

### భూసేకరణ పరిహారం, పైప్ ఇరిగేషన్‌పై సూచనలు

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహార చెల్లింపులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం అందితే బాధిత రైతులకు ఊరట లభించడం తోపాటు ప్రాజెక్టు పనులు కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందుకు సాగుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అత్యధిక భూములు ఆయిల్‌పామ్ సాగులో ఉన్నందున, సంప్రదాయ డిస్ట్రిబ్యూటరీ కాలువలకు బదులు పైపుల ద్వారా సాగునీటి పంపిణీ (పైప్డ్ ఇరిగేషన్ నెట్‌వర్క్) సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ తోటలకు నిరంతరం, నియంత్రిత పద్ధతిలో నీరు అందించేందుకు పైప్డ్ ఇరిగేషన్ విధానం మరింత అనుకూలంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు అత్యవసరంగా సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

### జూలూరుపాడు సొరంగం పునఃప్రారంభానికి చర్యలు

సీతారామ ప్రధాన కాలువపై జూలూరుపాడు సొరంగం నిర్మాణం వివిధ కారణాలతో నిలిచిపోయిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పనులను ప్రాధాన్యతతో పునఃప్రారంభించి, పాలేరు జలాశయానికి వీలైనంత త్వరగా నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని కోరగా, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. పాలేరు జలాశయానికి నీరు చేరితే ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరతాయని మంత్రి పేర్కొన్నారు.

మొత్తంమీద, సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను సమన్వయంతో పరిష్కరించుకుని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఇరువురు మంత్రులు ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు.

# 3 నెలల్లో యూసీఎఫ్ పనులు షురూ...

- రూ.840 కోట్లతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దుతాం

**కరీంనగర్ వెలుతురు జూలై 15:**

రాబోయే 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) స్కీం కింద కేంద్రం మంజూరు చేసిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దే పనులన ప్రారంభిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఆయా నిధులతో కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మించడంతోపాటు స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తామని స్పష్టం చేశారు.కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం రోజున ఉదయం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి 47వ డివిజన్ లోని రాంనగర్ సిద్దార్థ స్కూల్ సమీపంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ శ్రీరామ బుక్ స్టాల్ లేన్ నుండి మోర్ సూపర్ మార్కెట్ వరకు రూ.98 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి(యూఐడీఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ కు మంజూరు చేసిన రూ.50 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులకు ఈరోజు మేయర్, డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది. మరో 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) స్కీం కింద కేంద్రం ఇచ్చిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దే పనులను కూడా ప్రారంభించబోతున్నాం. ఇచ్చిన మాట ప్రకారం ...కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించిన 100 రోజుల్లోనే యూడీఎఫ్ నిధులను తీసుకొచ్చిన. మాపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం... సమస్యల్లేని డివిజన్ గా తీర్చిదిద్దుతా.మీకు తెలుసు. గతంలో నిధుల్లేక ఇబ్బందులు పడేవాళ్లం.. కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా ఇవ్వలేని దుస్థితి. ఇయాళ గల్లా ఎగరేసుకుని అభివృద్ధి పనులు చేయించే సత్తా కార్పొరేటర్లకు వచ్చింది. ప్రజలు ఆశీర్వదించి మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించడంతో ప్రధాని వద్దకు వెళ్లి కరీంనగర్ కు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని కోరుతున్నాం. దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే యూసీఎఫ్ ఫండ్ ఇస్తే... ఆ జాబితాలో కరీంనగర్ కూడా చేరింది.ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల



రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ లో పార్కింగ్ సమస్య లేకుండా రూ.25 కోట్లతో శాశ్వత పరిష్కార పనులకు శ్రీకారం చుట్టినం. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో కరీంనగర్ ను అభివృద్ధి చేస్తున్నా.ఇక కరీంనగర్ పార్లమెంట్ విషయానికొస్తే... ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.22 వేల కోట్లు తీసుకొచ్చిన. రోడ్ల నిర్మాణం కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నం. దసరా నాటికి కరీంనగర్ వరంగల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. అతి త్వరలో కరీంనగర్ జగిత్యాల హైవే పనులను ప్రారంభిస్తాం. గన్నేరువరం బ్రిడ్జి నిర్మాణ పనులకు సైతం అతి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం. రాబోయే రోజుల్లో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా... అభివృద్ధి చేస్తా. కరీంనగర్ పార్లమెంట్ ను అభివృద్ధిలో అగ్రగామిగా, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నా.

# తుంగతుర్తి వివాదాన్ని జగ్గారెడ్డే పరిష్కరిస్తారు: కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- మండల అధ్యక్షుల నియామకాలపై నివేదిక..
- ఈ నెల 20లోపు అధిష్ఠానానికి సమర్పిస్తానన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్
- తుంగతుర్తి వివాదంలో తాను జోక్యం చేసుకోనన్న మంత్రి కోమటిరెడ్డి.
- బంజారాహిల్స్ నివాసంలో జగ్గారెడ్డితో కీలక సమావేశం.
- మండల అధ్యక్షుల నియామకాలపై సుదీర్ఘ చర్చ.
- ఏఐసీసీ నిబంధనలు ఉల్లంఘించి నియామకాలు జరిగాయని ఆరోపణ.
- మూడు, నాలుగు మండలాల్లో నిబంధనలు పాటించలేదన్న జగ్గారెడ్డి.
- వరుసగా మూడేళ్లు పార్టీ కార్యకర్తగా ఉన్న వారికే అవకాశం ఉండాలన్న స్పష్టీకరణ.
- వివాదంపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని వెల్లడి.
- ఈ నెల 20లోపు నివేదిక సమర్పిస్తానన్న జగ్గారెడ్డి.
- పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే తదుపరి చర్యలు.
- తుంగతుర్తి కాంగ్రెస్‌లో వివాదం రాజకీయంగా చర్చనీయాంశం.



**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకాలపై నెలకొన్న వివాదం ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. ఈ వ్యవహారాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పరిశీలిస్తారని, తాను ఇందులో జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు.బంజారాహిల్స్‌లోని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో జగ్గారెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకాలు, వాటిపై వ్యక్తమైన అభ్యంతరాలు, పార్టీ నాయకుల మధ్య నెలకొన్న విభేదాలపై ఇద్దరూ చర్చించినట్లు సమాచారం.సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. తుంగతుర్తి అంశంలో మంత్రి కోమటిరెడ్డి ఎలాంటి జోక్యం చేసుకోవడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పార్టీ పరంగా పరిశీలించి అధిష్ఠానానికి నివేదిక సమర్పిస్తానని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకాలకు సంబంధించి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించిందని జగ్గారెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడిగా నియమితులవ్వాలంటే కనీసం వరుసగా మూడు సంవత్సరాల పాటు పార్టీ కార్యకర్తగా పనిచేసి ఉండాలని నిబంధన ఉందన్నారు. అయితే తుంగతుర్తి నియోజకవర్గంలోని మూడు నుంచి నాలుగు మండలాల్లో ఈ నిబంధనలను పాటించకుండా నియామకాలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని వెల్లడించారు.ఈ అంశంపై సంబంధిత నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం ఈ నెల 20వ తేదీలోపు సమగ్ర నివేదికను పార్టీ అధిష్ఠానానికి అందజేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.తుంగతుర్తి నియోజకవర్గంలో మండల అధ్యక్షుల నియామకాలపై నెలకొన్న వివాదం కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ప్రాధాన్యత సంతరించుకోగా, ఈ వ్యవహారంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# రేణుక వ్యాఖ్యలను వక్రీకరించారు

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని మాత్రమే రేణుక అన్నారని వెల్లడి
- సీపీఐ తమ మిత్రపక్షమేనని, కూనంనేని పట్ల గౌరవం ఉందని వ్యాఖ్య
- సీపీఐతో కాంగ్రెస్ మైత్రి కొనసాగుతుందని స్పష్టీకరణ
- కూనంనేనితో ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్న టీపీసీసీ చీఫ్
- స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచన
- ప్రతి చిన్న అంశానికి గాంధీభవన్‌కు రావొద్దని క్యాడర్‌కు హితవు
- ఎక్కువ మంది డీసీసీ అధ్యక్షుల పనితీరు సంతృప్తికరంగా ఉందని వ్యాఖ్య
- ఈ నెలాఖరులోగా 50కి పైగా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని వెల్లడి

డైరెక్టర్ పదవుల భర్తీ ప్రక్రియను కూడా త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేశారని ఆయన అన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని మాత్రమే రేణుకా చౌదరి చెప్పారని, ఆమె వ్యాఖ్యలకు వేరే అర్థాలు తీయడం సరికాదని స్పష్టం చేశారు.సీపీఐ తమ మిత్రపక్షమేనని, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్–సీపీఐ మైత్రి యథావిధిగా కొనసాగుతుందని, కూనంనేనితో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.పార్టీకి సంబంధించిన స్థానిక సమస్యలను ఆయా జిల్లాలు, నియోజకవర్గాల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని పార్టీ



నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి చిన్న అంశాన్ని గాంధీభవన్‌కు తీసుకురావాల్సిన అవసరం లేదని అన్నారు.పార్టీ సంస్థాగత వ్యవహారాలపై మాట్లాడుతూ, నలుగురు లేదా ఐదుగురు మినహా మిగతా డీసీసీ అధ్యక్షుల పనితీరు బాగుందని చెప్పారు. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, మరో రెండు రోజుల పాటు సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ నెలాఖరులోగా 50కి పైగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని వెల్లడించారు. అలాగే మండల కమిటీల నియామకంలో డీసీసీ అధ్యక్షుల నిర్ణయానికే తుది ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. డైరెక్టర్ పదవుల భర్తీ ప్రక్రియను కూడా త్వరలో చేపడతామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# దృశ్యరూపం లేని చైతన్య స్రవంతి

అనంత విశ్వంలో కంటికి కనిపించదు, చేతికి చిక్కదు. కానీ, సృష్టిలోని ప్రతి అణువునూ స్పృశిస్తూ, సమస్త ప్రాణకోటికి జీవనాడుగా నిలిచే ఒక అదృశ్య మహా శక్తి గాలి. వృక్షాగ్రాలు ఊగినప్పుడు, మేఘ మాలికలు ఆకాశ వీధిలో కదిలినప్పుడు, సాగర కెరటాలు ఉవ్వెత్తున లేచినప్పుడు మాత్రమే మనం దాని ఉనికిని, ప్రభావాన్ని గుర్తిస్తాం. శతాబ్దాలుగా ఈ అదృశ్య ప్రకృతి శక్తి కవుల ఊహలకు, తత్వవేత్తల ఆలోచనలకు సరికొత్త పదును పెడుతూనే ఉంది. నిశితంగా పరిశీలిస్తే, సమీరం కేవలం ఒక భౌతిక శక్తి మాత్రమే కాదు, మానవజాతికి అద్భుతమైన జీవన సూత్రాలను బోధించే ఒక నిశ్శబ్ద జగద్గురువు అని స్పష్టమవుతుంది. ఉరుకుల పరుగుల ఆధునిక జీవన గమనంలో కాస్త ఆగి ఆలోచిస్తే, ఈ చల్లని గాలి మన అంతరంగాలను మేల్కొలిపే ఎన్నో అమూల్యమైన పాఠాలను నిశ్శబ్దంగా అందిస్తోందని మనకు అర్థమవుతుంది.భీకరమైన తుఫానులు సంభవించినప్పుడు ప్రకృతిలో జరిగే వినాశనాన్ని మనం ఎప్పుడైనా గమనించామా? అత్యంత దృఢంగా, నిటారుగా, అహంభావంతో నిలబడే మహావృక్షాలు సైతం కూకటి వేళ్లతో సహా నేలమట్టం అవుతుంటాయి. కానీ అదే సమయంలో, గాలి వీచే దిశకు అనుగుణంగా సుకుమారంగా వంగి, ఆ ఉధృతి తగ్గాక మళ్లీ నిటారుగా లేచే వెదురు చెట్లు మాత్రం ఎలాంటి నష్టం లేకుండా చెక్కు చెదరకుండా నిలుస్తాయి. ప్రకృతి మనకు అందిస్తున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన మొదటి పాఠం ఇదే. మొండితనం ఎప్పుడూ పతనానికి దారితీస్తుంది, కానీ పరిస్థితులకు అనుగుణంగా మారే లౌక్యం, అనుకూలత మాత్రమే జీవితాన్ని నిలబెడతాయి. సంక్షోభాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, మూర్ఖంగా ఢీకొట్టకుండా, సమయానుకూలంగా మన వ్యూహాలను మార్చుకుంటూ తిరిగి నిలదొక్కుకునే మనస్తత్వమే అసలైన మానసిక బలం. జీవితంలో వచ్చే ప్రతి సవాలునూ ప్రతిఘటించడమే వీరత్వం అనుకోవడం భ్రమ. కొన్నిసార్లు కాస్త వంగి, నేర్చుకుని, మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో పైకి లేవడమే అత్యంత వివేకవంతమైన మార్గం. వెదురులా వంగడం అనేది ఓటమికి సంకేతం కాదు, అది విపత్కర పరిస్థితులలో మనుగడ సాగించడానికి అవసరమైన ఒక అద్భుతమైన జీవన వ్యూహం.సమీరం ఎప్పుడూ అనవసరమైన హడావిడి లేదా ఆర్భాటం చేయదు. కానీ కాలక్రమేణా అది అసాధ్యమైన మార్పులను సుసాధ్యం చేస్తుంది. నిరంతరాయంగా వీస్తూ కొండల ఆకృతులను కోసేస్తుంది, ఎడారిలోని ఇసుక తిన్నెల స్వరూపాన్నే మార్చివేస్తుంది, కఠినమైన రాళ్లను సైతం నున్నటి శిల్పాలుగా చెక్కేస్తుంది. ఇది ఒక్కరోజులో లేదా రాత్రికి రాత్రే జరిగే అద్భుతం కాదు. నిరంతరం, నిశ్శబ్దంగా సాగే సుదీర్ఘ ప్రయత్నం వల్లే ఇంతటి సానుకూల మార్పు సాధ్యమవుతుంది. మానవ జీవిత గమనంలో కూడా ఈ సూత్రం అక్షరాలా వర్తిస్తుంది. సమాజంలో గొప్ప విజయాలు



ఎవరికీ అంత తేలికగా లభించవు. ప్రతిరోజూ మనం చేసే చిన్న చిన్న ప్రయత్నాలు, ఎవరూ గమనించని సమయంలో మనం ప్రదర్శించే నిబద్ధత, అంతర్గతంగా సాగే నిశ్శబ్ద శ్రమఇవే కాలక్రమేణా అద్భుతమైన ఫలితాలుగా రూపాంతరం చెందుతాయి. ఆర్భాటాలతో, తాత్కాలిక హడావిడితో సాధించే విజయాల కంటే, ఓపికగా, క్రమశిక్షణతో, నిలకడగా సాగే నిశ్శబ్ద ప్రయాణమే జీవితానికి శాశ్వతమైన కీర్తిని, సుస్థిరమైన ఫలితాన్ని అందిస్తుంది.గాలిని ఎవరూ తమ గుప్పిట్లో బంధించలేరు. ఒకవేళ దాన్ని పిడికిట్లో పట్టుకోవాలని ప్రయత్నిస్తే, అది వేళ్ల సందుల నుండి జారిపోతుంది. కానీ అదే గాలిని స్వేచ్ఛగా వదిలేస్తే, అది సమస్త జీవకోటికి ప్రాణవాయువును అందిస్తుంది, సముద్రంలో నౌకలను ప్రగతి పథం వైపు ముందుకు నడిపిస్తుంది, భారీ గాలిమరలను తిప్పుతూ అంధకారాన్ని పారద్రోలే విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియ మానవాళికి ఒక గొప్ప సత్యాన్ని బోధిస్తుంది. మన జీవితంలో ప్రతి విషయాన్నీ గట్టిగా పట్టుకుని ఉంచాలని అనుకోవడం, ఇతరులను పూర్తిగా మన అదుపులో ఉంచుకోవాలని భావించడం వల్ల మనం వాటిని శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది. మానవ సంబంధాలైనా, వ్యాపార అవకాశాలైనా, జీవితంలో సంభవించే మార్పులైనా వాటికి తగినంత స్వేచ్ఛను ఇచ్చినప్పుడే అవి వాటి పరిపూర్ణ విలువను సంతరించుకుంటాయి. అతిగా బంధించాలనే తపన, మితిమీరిన నియంత్రణ ఆత్మీయ బంధాలను దూరం చేస్తాయి. కొన్నిసార్లు విషయాలను వాటి దారిన వాటిని వదిలేయడంలోనే అత్యున్నతమైన జీవన జ్ఞానం దాగి ఉందనే విషయాన్ని మనం గ్రహించాలి.పురాతన కాలం నుండి నావికులు గాలి వీచే దిశను బట్టి తమ నౌకల తెరచాపలను అత్యంత నైపుణ్యంతో సర్దుబాటు చేసుకునేవారు. గాలి ఎటు వీస్తే నౌక అటు కొట్టుకుపోదు; చతురుడైన నావికుడు తన మేధస్సుతో, గాలి యొక్క సహజ శక్తిని తనకు అనుకూలంగా మార్చుకుని, తాను చేరుకోవాల్సిన నిర్దేశిత గమ్యస్థానానికే చేరుకుంటాడు. ఇది సమకాలీన జీవితానికి ఒక అద్భుతమైన ఉపమానం. మన చుట్టూ ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులు నిరంతరం మారుతుంటాయి. కొన్నిసార్లు అవి మనకు అనుకూలంగా ఉంటే, మరికొన్నిసార్లు తీవ్ర ప్రతికూలంగా మారవచ్చు. కానీ మన జీవిత లక్ష్యం స్పష్టంగా, దృఢంగా ఉంటే, ఎంతటి ఎదురుగాలి వీచినా ముందుకు సాగే సరికొత్త మార్గాలను అన్వేషించవచ్చు. ప్రతికూల పరిస్థితులను నిందిస్తూ కాలం వృథా చేయడం కంటే, వాటిని లోతుగా అర్థం చేసుకుని, తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకోవడమే నిజమైన విజయానికి రాజమార్గం అవుతుంది. ఎదురుగాలి వచ్చిందని ప్రయాణాన్ని అర్ధాంతరంగా ఆపేయవలసిన అవసరం లేదు, కేవలం మన ఆలోచనా విధానాన్ని, ప్రణాళికలను సర్దుబాటు చేసుకుంటే సరిపోతుంది.మానవ నైజం సాధారణంగా కంటికి కనిపించే బాహ్య ఆకర్షణలకే, సంపదలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. కానీ వాస్తవానికి, కంటికి కనిపించని గాలి లేకపోతే ఈ సృష్టిలో జీవన మనుగడే సాధ్యం కాదు. ప్రతి శ్వాసలోనూ అది నిరంతరం మనకు తోడుగా ఉంటూ రక్షిస్తున్నప్పటికీ, మనం సాధారణంగా దాని ఉనికిని గుర్తించం, దానికి కృతజ్ఞతలు చెప్పుకోం. ఈ సహజ సిద్ధమైన సత్యం మన నిజ జీవితంలో మన ఎదుగుదలకు తోడ్పడే ఎందరో మహానుభావులను, నిశ్శబ్ద శక్తులను గుర్తు చేస్తుంది. మనం నిత్యం పెద్దగా పట్టించుకోని తల్లిదండ్రుల నిరంతర త్యాగాలు, కష్టకాలంలో స్నేహితులు అందించే నైతిక మద్దతు, మన భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల అమూల్యమైన మార్గదర్శకత్వం ఇందుకు నిదర్శనాలు. ఈ శక్తులన్నీ ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా, నిశ్శబ్దంగా మన వెనుక ఉండి నడిపిస్తాయి కాబట్టి మనం వాటిని తరచూ విస్మరిస్తుంటాం. గాలి మనకు నేర్పే అత్యంత ముఖ్యమైన పాఠం ఏంటంటే కంటికి కనిపించని అంతర్లీన శక్తులను, త్యాగాలను గుర్తించి, సదా కృతజ్ఞతా భావంతో జీవించడం.సృష్టిలో గాలి ఒక్కోసారి మనసుకు ఆహ్లాదాన్ని పంచే చల్లని పిల్లగాలిలా మృదువుగా వీస్తుంది, మరొక్కోసారి సర్వస్వాన్ని అతలాకుతలం చేసే ప్రళయ కారక తుఫానులా విరుచుకుపడుతుంది. కానీ బాహ్యంగా భిన్నంగా కనిపించే ఈ రెండు రూపాలూ ఒకే అంతర్గత శక్తి యొక్క వేర్వేరు పరిణామాలు మాత్రమే. మానవ జీవితంలో కూడా సుఖాలు, కష్టాలు, జయాలూ, అపజయాలూ అన్నీ ఒకే జీవన ప్రవాహంలో అంతర్భాగాలు. కష్టకాలం ఎదురైనప్పుడు అది తాత్కాలికమేనని గ్రహించి ధైర్యంగా నిలబడటం, సుఖాలు ప్రాప్తించినప్పుడు అహంకారం తలకెక్కకుండా వినయంతో మెలగడం ఈ మానసిక సమతుల్యతనే నిజమైన జీవన జ్ఞానం అంటారు. భీకరమైన తుఫాను ఎంత ఉధృతంగా మారినా, కాలక్రమేణా అది తిరిగి ప్రశాంతమైన స్థితికి చేరుకోవాల్సిందే. అలాగే మన జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టానికి, సంక్షోభానికి ఒక ముగింపు ఖచ్చితంగా ఉంటుంది.చివరగా చెప్పాలంటే, గాలి మనకు బోధించే అత్యంత అద్భుతమైన పరమార్థం ఏంటంటే జీవించడం అంటే ఒకే చోట స్థిరంగా ఉండిపోవడం కాదు, నిరంతరం ముందుకు సాగుతూ, మారుతున్న కాలంతో పాటు పరిణామం చెందుతూ, సమాజంలో తన మౌలిక స్వభావాన్ని, మానవత్వాన్ని కోల్పోకుండా ఉండటమే. మనం కూడా గాలిలా జీవించగలిగితే సమయానుకూలంగా వంగుతూ, నిశ్శబ్దంగా శ్రమిస్తూ, బంధనాల నుండి స్వేచ్ఛగా ప్రవహిస్తూ, లక్ష్యం వైపు మార్గాలను మార్చుకుంటూ, కనిపించని త్యాగాలకు కృతజ్ఞత చూపుతూ సాగితే మన జీవితం అత్యంత అర్థవంతంగా మారుతుంది. తదుపరిసారి చల్లని గాలి మీ ముఖాన్ని తాకినప్పుడు, ఒక్క క్షణం ఆగి, అది చెప్పే ఈ నిశ్శబ్ద పాఠాలను మీ అంతరంగంతో వినండి. ఎందుకంటే అవి ఏ గ్రంథాలలోనూ దొరకని అనంతమైన జీవన జ్ఞానాన్ని అందిస్తాయి.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# సామాజిక న్యాయం అంటే ప్రసంగాలా?... లేక రాజకీయ ప్రాతినిధ్యమా?

తెలంగాణ రాజకీయాల్లో బీసీల రాజకీయ సాధికారత మరోసారి కేంద్ర చర్చగా మారింది. ప్రతి ఎన్నికల సమయంలో బీసీలు రాజకీయ పార్టీలకు అత్యంత కీలకమైన సామాజిక వర్గంగా కనిపిస్తారు. వారి జనాభా గురించి మాట్లాడతారు. వారి శ్రమను కొనియాడతారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం వంటి నినాదాలతో వారి మద్దతు కోరుతారు. కానీ ఎన్నికలు ముగిసి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే బీసీలకు నిర్ణయాత్మక స్థానాలు, అధికారంలో తగిన ప్రాతినిధ్యం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు వంటి అంశాల్లో ఎందుకు వెనుకంజ వేస్తున్నారనే ప్రశ్న మళ్లీ బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వినిపిస్తున్న ప్రధాన విమర్శ కూడా ఇదే.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో విశేష ప్రాధాన్యం పొందింది. బీసీల ఆర్థిక, సామాజిక, విద్యా, రాజకీయ సాధికారత కోసం అనేక హామీలు అందులో చోటు చేసుకున్నాయి. సంప్రదాయ వృత్తులకు ప్రోత్సాహం, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు, పెద్దఎత్తున నిధుల కేటాయింపు, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం వంటి అంశాలను కాంగ్రెస్ ప్రముఖంగా ప్రస్తావించింది. ఆ కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకత్వం పాల్గొనడం వల్ల ఆ హామీలకు మరింత విశ్వసనీయత ఏర్పడింది. దశాబ్దాలుగా రాజకీయంగా తగిన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న బీసీ సమాజంలో ఈ ప్రకటన ఆశలను పెంచింది.

ఆ సమయంలో సామాజిక న్యాయం కోసం నిరంతరం గళమెత్తిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కంచ ఐలయ్య కాంగ్రెస్‌కు బహిరంగ మద్దతు ప్రకటించడం కూడా రాజకీయంగా ప్రభావం చూపిందనే అభిప్రాయం వ్యక్తమైంది. బీసీల హక్కుల కోసం నిరంతరం మాట్లాడిన ఒక మేధావి మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా కొత్త అవకాశాలు లభిస్తాయని చాలామంది విశ్వసించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఆశలు ఎంతవరకు నెరవేరాయనే ప్రశ్న ఇప్పుడు బీసీ సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పరిశీలకుల మధ్య విస్తృత చర్చకు దారితీసింది.ప్రజాస్వామ్యంలో ఎన్నికల హామీలు కేవలం ప్రచార సభలకే పరిమితం కావు. అవి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విధానాలుగా మారాలి. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు పాలనలో కనిపించాలి. లేకపోతే ప్రజల్లో అనుమానాలు తలెత్తడం సహజం. ప్రస్తుతం బీసీ సమాజం కూడా అదే ప్రశ్నిస్తోంది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చేసిన హామీల్లో ఎంతవరకు అమలు జరిగింది? ఎంత నిధులు కేటాయించారు? ఎంత విడుదల చేశారు? ఎంత ఖర్చు చేశారు? ఎన్ని పథకాలు ప్రారంభమయ్యాయి? ఎంతమంది లబ్ధిదారులు ప్రయోజనం పొందారు? వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.సామాజిక న్యాయం అంటే కేవలం సంక్షేమ పథకాలు ప్రకటించడం మాత్రమే కాదు. రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడం కూడా అంతే ముఖ్యమైన అంశం. బీసీలు రాష్ట్రంలో అతిపెద్ద సామాజిక వర్గాల్లో ఒకటిగా అన్ని రాజకీయ పార్టీలు అంగీకరిస్తున్నప్పటికీ, రాష్ట్ర అత్యున్నత రాజకీయ పదవుల్లో వారి ప్రాతినిధ్యం ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్న చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యమంత్రి పదవి విషయంలోనే కాదు, కనీసం ఉపముఖ్యమంత్రి పదవి వంటి కీలక స్థానాల్లో కూడా బీసీలకు అవకాశం ఎందుకు కల్పించడం లేదనే చర్చ తరచూ ముందుకు వస్తోంది. సామాజిక న్యాయం అనే నినాదం నిజంగా అమలవ్వాలంటే నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో కూడా బీసీల భాగస్వామ్యం పెరగాలని బీసీ సంఘాలు వాదిస్తున్నాయి.దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక న్యాయం, కుల గణన, వెనుకబడిన వర్గాల హక్కులు, సమాన అవకాశాల గురించి విస్తృతంగా మాట్లాడుతున్నారు. కానీ తెలంగాణలో అదే సిద్ధాంతం రాజకీయ నిర్ణయాల్లో ఎంతవరకు ప్రతిబింబిస్తోందనే ప్రశ్న విమర్శకుల నుంచి వస్తోంది. సామాజిక న్యాయం అంటే కేవలం ప్రసంగాల్లో వినిపించే నినాదం కాదు. అది మంత్రివర్గ కూర్పులో, కీలక నియామకాలలో, పార్టీ నిర్మాణంలో, స్థానిక సంస్థల ఎన్నికల టికెట్ల పంపిణీలో కూడా కనిపించాలి. అప్పుడు మాత్రమే ప్రజలు ఆ నినాదాలను విశ్వసిస్తారు.ఈ నేపథ్యంలో కంచ ఐలయ్య పాత్రపై కూడా చర్చ కొనసాగుతోంది. బీసీల సామాజిక హక్కుల కోసం దశాబ్దాలుగా రచనలు చేసిన మేధావిగా ఆయనకు ఉన్న గౌరవం ప్రత్యేకమైనది. అయితే తాను మద్దతు ఇచ్చిన రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే స్థాయిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారా? ఎన్నికల హామీల అమలుపై బహిరంగంగా స్పందిస్తున్నారా? అనే ప్రశ్నలు బీసీ సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. ఒక మేధావి విలువ అధికారాన్ని ఎంత ధైర్యంగా ప్రశ్నిస్తాడనే దానిపైనే ఆధారపడి ఉంటుందని అనేక మంది అభిప్రాయపడుతున్నారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో మేధావుల బాధ్యత అని వారు చెబుతున్నారు.అయితే ఈ ప్రశ్నలను వ్యక్తిగత విమర్శలుగా కాకుండా ప్రజాస్వామ్య చర్చలో భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులు మాత్రమే కాదు, మేధావులు, ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమ నాయకులు కూడా అధికారాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అదే ప్రజాస్వామ్య వ్యవస్థకు బలం చేకూరుస్తుంది.ఇప్పుడు బీసీ సమాజం కోరుతున్నది మరోసారి కొత్త హామీలు కాదు. గతంలో ఇచ్చిన హామీల అమలు. ప్రకటనలు కాదు, ఫలితాలు. ప్రసంగాలు కాదు, నిర్ణయాలు. సంక్షేమ పథకాల ప్రకటనలతో పాటు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కూడా కావాలని వారు స్పష్టంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కీలక మంత్రిత్వ శాఖలు, కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులు, ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థల నాయకత్వం,ప్రతి స్థాయిలో బీసీలకు సముచిత అవకాశాలు కల్పించాలనే డిమాండ్ మరింత బలపడుతోంది.ప్రస్తుతం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా రాజకీయ చర్చ సాగుతోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా అధిక సంఖ్యలో టికెట్లు కేటాయిస్తారా లేదా అన్నది కీలక ప్రశ్నగా మారింది. ఎన్నికల టికెట్ల పంపిణీ ఒక పార్టీ సామాజిక న్యాయంపై ఉన్న నిజమైన నిబద్ధతకు ప్రమాణంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా భవిష్యత్ నాయకత్వంగా గుర్తిస్తేనే ఆ విశ్వాసం బలపడుతుందని వారు అంటున్నారు.అయితే ఈ విమర్శలు కాంగ్రెస్‌కే పరిమితం కావు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై కూడా ఇలాంటి ప్రశ్నలే వచ్చాయి. బీసీల రాజకీయ సాధికారత విషయంలో ఏ ప్రధాన రాజకీయ పార్టీ పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదనే అభిప్రాయం కూడా ఉంది. బీసీల పేరుతో ఓట్లు కోరిన ప్రతి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఉత్సాహంతో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించలేకపోయిందనే విమర్శలు గతంలోనూ వినిపించాయి. అందువల్ల ఈ అంశాన్ని ఒక పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా కాకుండా ప్రజాస్వామ్య బాధ్యత కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.బీసీ సమాజం కూడా గతంతో పోలిస్తే ఎంతో రాజకీయ చైతన్యాన్ని సంపాదించింది. ఒకప్పుడు ఎన్నికల సమయంలో నాయకులు చెప్పిన మాటలను నమ్మి ఓటు వేసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఏ పార్టీ ఏ హామీ ఇచ్చింది? అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతవరకు అమలు చేసింది? బడ్జెట్‌లో ఎంత కేటాయించింది? ఎంత విడుదల చేసింది? ఎంత ఖర్చు చేసింది? రాజకీయ నియామకాల్లో ఎంత ప్రాధాన్యం కల్పించింది? అనే అంశాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సహజమైన పరిణామమే.అందుకే ప్రస్తుతం బీసీ సంఘాలు ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీపై సమగ్ర లెక్కలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి. పారదర్శకత ఉంటేనే ప్రజల్లో ఉన్న సందేహాలు తొలగుతాయని వారు భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ డిమాండ్‌ను రాజకీయ విమర్శగా కాకుండా ప్రజల ఆకాంక్షగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.సామాజిక న్యాయం అనే భావనకు నిజమైన అర్థం రావాలంటే అది కేవలం సంక్షేమ పథకాలలో మాత్రమే కాకుండా అధికార నిర్మాణంలో కూడా కనిపించాలి. రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా సామాజిక న్యాయం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. ఒక వర్గం జనాభాలో పెద్ద శాతం ఉన్నప్పటికీ అధికార నిర్ణయాల్లో వారి పాత్ర పరిమితంగా ఉంటే అసంతృప్తి పెరగడం సహజం. అందుకే బీసీలకు రాజకీయంగా మరింత అవకాశాలు కల్పించాలని వస్తున్న డిమాండ్లను విస్మరించలేము.ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వారు గుర్తుంచుకుంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును కూడా పరిశీలిస్తారు. నేటి ఓటరు గతంతో పోలిస్తే మరింత అవగాహనతో వ్యవహరిస్తున్నాడు. మాటలకన్నా చేతలను, ప్రకటనలకన్నా అమలును, నినాదాలకన్నా ఫలితాలను కొలుస్తున్నాడు. అందుకే రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల సమయంలో ఇచ్చే ప్రతి హామీని అమలు చేసే దిశగా కృషి చేయాల్సిన బాధ్యత మరింత పెరిగింది.కాంగ్రెస్ పార్టీ కూడా ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రశ్నలను అదే కోణంలో చూడాలి. బీసీలు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కోరుకోవడం లేదు. అధికారంలో భాగస్వామ్యం, నిర్ణయాత్మక పదవుల్లో ప్రాతినిధ్యం, పార్టీ నిర్మాణంలో ప్రాధాన్యం, స్థానిక సంస్థల నుంచి శాసనసభ వరకు సముచిత అవకాశాలు కోరుతున్నారు. ఈ ఆకాంక్షలను నెరవేర్చగలిగితేనే ఎన్నికల సమయంలో చేసిన సామాజిక న్యాయ వాగ్దానాలకు నిజమైన అర్థం వస్తుంది.

చివరికి ఈ చర్చ ఒకే ప్రశ్న చుట్టూ తిరుగుతోంది. ఎన్నికల సమయంలో బీసీల పేరుతో హామీలు ఇచ్చిన ప్రతి రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం నిజంగా ఎంత చేసింది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది కేవలం ఒక నాయకుడు, ఒక మేధావి లేదా ఒక పార్టీ మాత్రమే కాదు. బీసీల మద్దతు కోరిన ప్రతి రాజకీయ శక్తి. ప్రజాస్వామ్యంలో చివరికి నిలిచేది నినాదాలు కాదు. ప్రజలకు కనిపించే ఆచరణే. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు పాలనలో ప్రతిబింబించినప్పుడే ప్రజల విశ్వాసం నిలుస్తుంది. లేకపోతే ప్రతి ఎన్నికల ముందు ఇచ్చే హామీలు, ఎన్నికల తర్వాత మరచిపోయే సంప్రదాయంపై విమర్శలు కొనసాగుతూనే ఉంటాయి. బీసీ సమాజం ఇప్పుడు కోరుతున్నది ఇదొక్కటే—ప్రశంసలు కాదు, భాగస్వామ్యం, ప్రకటనలు కాదు, అమలు, మాటలు కాదు, అధికారంలో సముచిత స్థానం. అదే నిజమైన సామాజిక న్యాయం. అదే ప్రజాస్వామ్యానికి అసలు అర్థం.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టులు దుర్మార్గం





- **శంకర్‌పల్లిలో నల్ల బ్యాడ్జీలతో విద్యార్థుల నిరసన**

**శంకర్‌పల్లి, జూలై 15 :**

తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ఏబీవీపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) తీవ్రంగా ఖండించింది. ఈ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు నిరసనగా బుధవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ ఎస్ఎఫ్ఎస్ విభాగ్ కన్వీనర్ (షంషాబాద్) జి. హృషీకేశ్ గౌడ్, శంకర్‌పల్లి టౌన్ కార్యదర్శి శివకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధమని మండిపడ్డారు. విద్యార్థుల గొంతును అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వం తన వైఖరిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. విద్యార్థుల హక్కుల రక్షణ కోసం ఏబీవీపీ ఎల్లప్పుడూ చట్టబద్ధమైన, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఉపాధ్యక్షుడు జైపాల్, సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్, నాయకులు శ్రీకాంత్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈశ్వరమ్మ యాదవ్‌కు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

- **జక్కిడి శివ చరణ్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీసీ నాయకుల డిమాండ్**

**ఎల్బీనగర్, వెలుతురు జూలై 15:**

యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జక్కిడి శివ చరణ్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లోని ఈశ్వరమ్మ యాదవ్ నివాసానికి వెళ్లి ఆమెకు సంఘీభావం ప్రకటించిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు.బీసీలను కించపరిచే విధంగా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్ ఎన్నిక కావడాన్ని ఓర్వలేక అగ్రకుల అహంకారంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అని



ప్రశ్నించారు. బీసీలకు అవకాశాలు వస్తే ఈ విధంగా అవమానించడం తగదన్నారు."ఓట్లు మావి – సీట్లు మీవా? మీకెంత హక్కు ఉందో మాకూ అంతే హక్కు ఉంది" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం ఏ స్థాయిలో ఉద్ధృతంగా సాగిందో, అదే తరహాలో ఇప్పుడు యూనివర్సిటీల నుంచి గ్రామ గ్రామాన బీసీల ఉద్యమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.బీసీలు ఒకప్పుడు వెనుకబడిన వర్గం కావొచ్చు, కానీ ఇప్పుడు తమ శక్తి, సామర్థ్యాన్ని నిరూపించుకునే స్థాయికి చేరుకున్నారని అన్నారు. వయసుకు తగిన విధంగా బాధ్యతాయుతంగా మాట్లాడాలని జక్కిడి శివ చరణ్ రెడ్డికి హితవు పలికారు. తల్లి, అమ్మమ్మ వయస్సు ఉన్న వృద్ధురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమని తీవ్రంగా ఖండించారు.ఈశ్వరమ్మ యాదవ్ ఇప్పుడే కాదు, గత ఎన్నో సంవత్సరాలుగా దేవాలయాల పాలకమండలి సభ్యురాలిగా సేవలందిస్తూ, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సంఘీభావంలో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జాజుల శ్రీనివాస్ గౌడ్, వేములయ్య గౌడ్ ,బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో బూత్ లెవల్ అధికారులకు ఎస్ఐఆర్ దరఖాస్తు అందజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**మంచాల వెలుతురు జులై 15:**

మంచాల మండలం ఎస్ ఐ ఆర్ ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా ఆరుట్లగ్రామపంచాయ తీ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారం అందజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రఎన్ని కల సంఘం ప్రవేశపెట్టిన ఓటర్ సవరణ మరియు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించు కోవాలి మరియు ఈయొక్కదరఖాస్తు ఫారం ఇవ్వని ఓటర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు ఇవ్వాలి అన్నారు రాష్ట్రఎన్నికల సంఘం ప్రవేశపె ట్టిన మార్గదర్శకాలు పాటిస్తూ అధికారులు ప్రజలకు వివరించి వారివద్ద నుంచి ఎస్ ఐ ఆర్ అప్లి కేషన్ ఫారంను తీసుకోవాలని అధికారులకు సూచించారు దివాంగులకు వికలాంగులకు చెందిన ఎస్ ఐ ఆర్ ఫారంలను బి ఎల్ ఓ లు నేరుగా ఇంటి వద్దకు వెళ్లి స్వీకరించలని అని సూచించా రు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాజీసర్పంచ్ ఆ నంగల్ల యాదయ్య మాజీ ఎంపిటిసి లాలగారి శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్యముదిరాజ్ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణముదిరాజ్ కంబాలపల్లి బుగ్గ రాములు కోరే బాబు కాంగ్రెస్ పా ర్టీ నాయకులు చీమర్ల



శేఖర్ చీమర్ల క్రాంతి కుమార్ మహమ్మద్ అష్రాఫ్ బిఎల్ ఓ అధికారులు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో వసతులు



- **కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా యూనిఫాంల పంపిణీ**

**శంకర్పల్లి, వెలుతురు జూలై 15 :**



శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నందు విద్యార్థినులకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా విద్యార్థినులకు యూనిఫాంలను అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు, నాణ్యమైన విద్యను అందిస్తోందని తెలిపారు. విద్యార్థులంతా క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు అశోక్, గణేష్, ప్రముఖ నాయకులు గుండా శేఖర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి, దుస్తుల పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ మధురవాణి అధ్యక్షత వహించగా.. ఉపాధ్యాయులు వాసవి, స్రవంతి, ఇందిర, మీన, కళ్యాణి, ఝాన్సీ మరియు పాఠశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సొంత నిధులతో కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ బడి

- **పనులను పరిశీలించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 15 :**

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తన సొంత నిధులతో చేపట్టిన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం తుది దశకు చేరుకుంది. మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో శరవేగంగా జరుగుతున్న పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను బుధవారం మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల గదులు, ప్రహరీ గోడ, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల నాణ్యతను ఆమె నిశితంగా పరిశీలించి, అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.



**ప్రభుత్వ బడులపై కేటీఆర్ మమకారం.. శ్లాఘనీయం**

ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో కేటీఆర్ తన సొంత నిధులను కేటాయించి ఈ భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'మన ఊరు – మన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని, అదే స్ఫూర్తితో కేటీఆర్ వ్యక్తిగతంగా స్పందించి జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే స్థానిక పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



**ప్రభుత్వ విద్యపై చిత్తశుద్ధి బీఆర్ఎస్‌దే..**

నాడు కేసీఆర్ నాయకత్వంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య, ఉచిత దుస్తులు, సన్నబియ్యం భోజనం అందించామని సబితా ఇంద్రారెడ్డి గుర్తుచేశారు. పదవుల్లో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే తత్వం బీఆర్ఎస్ నాయకులదన్నారు. జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని త్వరలోనే ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూగర్భ కాలువలే మురికినీటి సమస్యకు పరిష్కారం






**శంకర్ పల్లి, వెలుతురు జులై 15 :**

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం 7వ వార్డు రామంతపురంలో రూ.5 లక్షలు, 8వ వార్డు ఫతేపురంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ నీటి కాలువ (అండర్‌గ్రౌండ్ డ్రెయినేజ్) పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యను నివారించడమే లక్ష్యంగా మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగరెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్, అఖిల యాదిరెడ్డి, అశోక్, గణేష్, గిరిజ శేఖర్, నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో వైద్య & ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి సమీక్ష

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 15:**

కొంగర కలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (IDOC) సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి వైద్య మరియు ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న తల్లి–శిశు ఆరోగ్య సేవలు, జాతీయ టీకాల కార్యక్రమం, క్షయవ్యాధి నియంత్రణ, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, నేషనల్ డీ–వార్మింగ్ డే కార్యక్రమం తదితర




అంశాల పురోగతిని అధికారులతో సమీక్షించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రతి వైద్య సంస్థలో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వరాలపై ప్రత్యేక నిఘా, ఇంటింటి సర్వేలు, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అలాగే అన్ని ఆరోగ్య కార్యక్రమాలను లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారులు, జిల్లా స్థాయి కార్యక్రమాల అధికారులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నోడల్ అధికారులు మరియు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి ఓటే ఓ ఆయుధం అదే అసలైన బలం:సీనియర్ కాంగ్రెస్ నాయకులు కే. నర్సింగ్ రావు.

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 15:**

ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కే. నర్సింగ్ రావు కోరారు.ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అత్యంత శక్తివంతమైన ఆయుధమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కే. నర్సింగ్ రావు అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా 286వ డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధి వినాయక నగర్ లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలను కలుసుకుని ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమని, హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతతో పాటు, ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేరు లేని అర్హులందరూ ఎస్ఐఆర్ ఫారాలు నింపి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదులో నిర్లక్ష్యం భవిష్యత్తులో తమ ప్రజాస్వామ్య హక్కును కోల్పోయే పరిస్థితికి దారితీస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మురళి, నాగరాజు, కృష్ణవేణితో పాటు సంబంధిత బీఎల్ఓలు (బి ఎల్ ఓ లు) పాల్గొని ప్రజలకు దరఖాస్తు ప్రక్రియను వివరించి, ఫారాల స్వీకరణ చేపట్టారు. ప్రజలు పెద్ద సంఖ్యలో స్పందించి ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 28న జరగబోయే సాంస్కృతిక బోనాల జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన

- **సీజీఎన్ కల్చరల్ అసోసియేషన్ బృందం.**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 15:**

తెలంగాణ ఆషాఢ మాస బోనాల జాతర సంప్రదాయాలను కనుల పండుగగా నిర్వహించాలని ఈ నెల 28న సీజీఎన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజర్ సందీప్ నేతృత్వంలో భారీ సాంస్కృతిక బోనాల జాతర నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకుడు సందీప్ తెలిపారు. బుధవారం కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. బోనాల జాతర విశిష్టతను ప్రతిబింబించేలా సంప్రదాయ బోనాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈజాతరను. కొంపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సాంస్కృతిక బోనాల జాతరను విజయవంతం



చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో హేమంత్, కార్తీక్, మహేష్, నందిని, మమతా, సునీత, చంద్రశేఖర్,అనిల్ లు పాల్గొన్నారు.

# గంధసిరి శరణ్య పల పుష్పాలంకరణ (ఒడినింపుట) వేడుకకు హాజరైన చిలివేరు సమ్మయ్య గౌడ్

- శరణ్యకు పట్టు వస్త్రాలు బహుకరించి ఆశీర్వదించిన గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్..

**కేసముద్రం వెలుతురు జూలై 15:**

కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన గంధసిరి యాదగిరి – సుభద్ర దంపతుల కుమార్తె కుమారి గంధగిరి శరణ్య పలపుష్పాలంకరణ (ఒడినింపుట) వేడుక ఆదివారం వారి స్వగృహంలో బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు సమ్మిగౌడ్ చిలువేరు ముఖ్య అతిథిగా హాజరై, శరణ్యకు అలాగే ఆమె కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు బహుకరించి "ఆడబిడ్డ ప్రతి కుటుంబానికి మహాలక్ష్మి స్వరూపిణి..విద్యతో పాటు మంచి సంస్కారం,



విలువలతో ఎదిగి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని, సరస్వతి, లక్ష్మీదేవి అనుగ్రహంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని" మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.అలాగే మన తెలుగు సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే ఇటువంటి పరిపుష్పాలంకరణ, ఒడినింపుట వంటి ఆచారాలను భావితరాలకు అందించడం ప్రతి కుటుంబం బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శరణ్యకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విచ్చేసిన అతిథులకు నిర్వాహకులు సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుక ఆహ్వానితులను ఆకట్టుకుని ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణంలో ఘనంగా జరిగింది.. ఈ కార్యక్రమంలో సమ్మిగౌడ్ తో పాటు మాజీ సర్పంచ్ వెంకన్న గౌడ్, యాదగిరి, రిపోర్టర్ చింతనూరి రాజు,మోడెం రాజు, పలుస సునీతా వెంకన్న, తండ సంపత్ గౌడ్, ఎండీ షబ్బీర్, ఆకుల రాజు,బబ్బురి బుచ్చిరాములు, పలుస రాకేష్,రాజా నాయక్, వెంకటేశ్వర్లు,నాని మోడెం పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ సర్వేలో అర్హత కల్గిన ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

- దుబ్బ రవికుమార్

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 15:**



నార్కెట్‌పల్లి పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా BLO ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను బీఆర్ఎస్ నాయకులు దుబ్బ రవికుమార్, నడింపల్లి మహేష్, ముంత నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలకు ఓటరు నమోదు, వివరాల సవరణ, పేరు చేర్పు, తొలగింపు తదితర అంశాలకు సంబంధించిన ఫారాలను ఎలా సక్రమంగా నింపాలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండటం ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను ఒకసారి తప్పకుండా పరిశీలించి, ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే సకాలంలో సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు పూర్తి చేసుకోవాలని సూచించారు.అలాగే, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ ఔదార్యం

**మోత్కూర్, జులై 15,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ పితృదేవోభవ స్వచ్ఛంద సంస్థ వారు మరో సేవా కార్యక్రమం ధ్వార వారి ఔధార్యాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళ్తే మోత్కూర్ మండలం పాలడుగు గ్రామానికి చెందిన తొంట ఉష అనే నిరుపేద మహిళ గత ఏడాది కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అనేక ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటంతో చివరకు మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థను ఆశ్రయించారు.విషయం తెలుసుకున్న వెంటనే సంస్థ సభ్యులు ఆమెను భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.గాంధీ ఆసుపత్రిలో సుమారు 25 రోజుల పాటు చికిత్స పొందుతున్న సమయంలో సంస్థ సభ్యులు డాక్టర్ కృష్ణ, శివ, రాము తదితరులు నిరంతరం వైద్యులతో



సంప్రదింపులు జరుపుతూ రోగి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. అలాగే చికిత్సకు అవసరమైన మందులు, ఇతర ఖర్చుల నిమిత్తం సంస్థ తరఫున రూ.15,000 ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.ప్రస్తుతం తొంట ఉష ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడిందని, డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన అంబులెన్స్ లో ఉషని వారి ఇంటి దగ్గర క్షేమంగా దింపి రావడం జరిగిందిఈ సేవా కార్యక్ర



మానికి సనీక్ష ఫౌండేషన్ తరఫున రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీ సోమయ్య గారు ఉదారంగా ఆర్థిక సహాయం అందించి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

అపదలో ఉన్న నిరుపేదలకు వైద్య సహాయం, ఆర్థిక చేయూత అందిస్తూ మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ మానవతా సేవలను నిరంతరం కొనసాగిస్తోందని సంస్థ సభ్యులు తెలిపారు.

# సహజ మరణానికి రూ. 5 లక్షల పరిహారం ఇవ్వాలి

**మునుగోడు,జూలై 15(వెలుతురు):**

భవన నిర్మాణ కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మునుగోడులో జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, సీఎస్‌సీ హెల్త్ టెస్టులను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న జరిగే జిల్లా కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ




సభ్యులు వరికుప్పల ముత్యాలు, జై సైదులు , జె శంకర్ , వై వెంకట్రావ్ , వి కిరణ్ , జి ఉదయ్ భాస్కర్ , ఎం చంద్ర స్వామి , పి లక్ష్మయ్య ,వి ముత్యాలు , ఎం నరసింహ , ఎస్ సురేష్ , ఆర్ సురేష్ , ఎల్ వెంకన్న , డి గిరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి హై కోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 15:**

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అందుకు గురువుల సహకారం చదువులో తప్పక అవసరమని గురువు లేని విద్య గుడ్డి విద్య అని, క్రమశిక్షణ పట్టుదల తో బాగా చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు ఊరికి ఎంతో పేరు తెచ్చిన వారవుతారని ప్రముఖ హై కోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్ వారి సతీమణి జడ్చర్ల డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ గంజి సుకన్య అన్నారు. మునిపంపుల వాస్తవ్యులు మిర్యాల రవీందర్ తల్లిదండ్రులు మిర్యాల హరి గోవింద్ – జయ లక్ష్మి సౌజన్యం తో మునిపంపుల ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు 700 నోటు పుస్తకాల ను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడారు. ముఖ్య అతిథి సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ ఉత్తమ పౌరులు గా రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమని విద్యార్థులకు సూచించారు. మునిపంపుల లో చదువుకున్న ఉన్నత స్థాయిలో ఉన్నవారు మన విద్యార్థుల కోసం ఇలా ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు . పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఇంకా నలుగురు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం రవీందర్ దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి, ఏ ఏ పి సి చైర్మన్ బతిని వెంకటమ్మ, వార్డ్ మెంబర్ యదాసు లక్ష్మణ్, సేవా భారతి సంస్థ చైర్మన్ మన్నే పద్మా రెడ్డి, మాజీ సర్పంచ్ యదాసు యాదయ్య, మాజీ ఎంపీటీసీ గాదె పారిజాత, పాఠశాల టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునిపంపుల.

# అమెరికా లో ఉన్న ఆత్మీయునికి ఘనంగా జన్మదిన వేడుకలు....

**మోత్కూర్, జులై 15,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ కి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, మోత్కూర్ డవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్షులు మోత్కూరి బ్రహ్మ చారి జన్మదిన సందర్భంగా తన ఆత్మీయులు, మిత్రులు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అందరు కలిసి అర్జున వృక్షం మొక్క నాటడం జరిగింది. అంతకు ముందు బ్రహ్మ చారి 72 వ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. వీడియో కాల్ ద్వారా మిత్ర బృందం శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి ఆత్మీయులు అవిశెట్టి అవిలు మల్లు, మర్రి ఆనందం, బయ్యని రాజు, కోమటి మత్స్యగిరి , బొడ్డుపల్లి మైసయ్య, చేతరాశి వేంకన్న, బిళ్ళపాటి గోవర్ధన్ రెడ్డి, మోత్కూరి సురేష్, సజ్జనం మనోహర్, పట్టూరి అంజయ్య,శ్రీశైలం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ను అందజేసి నిజాయితీని చాటుకున్న అధ్యాపకుడు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 15:**

నల్లగొండ నుండి భువనగిరికి బయలుదేరుతున్న బస్సులో ఉదయం 9 గంటల ప్రాంతంలో చిట్యాల ప్రాంతానికి చెందిన చంద్రు అనే వ్యక్తి తన మొబైల్ ను మరచిపోగా అదే బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో పనిచేస్తున్న గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీనుకు లభించింది. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలను ఆరా తీసి మరల ఆ వ్యక్తికి శ్రీను అందజేయడం జరిగింది. వంద రూపాయలు దొరికితేనే ఎవరికీ చెప్పకుండా జేబులో వేసుకొని పోయే వ్యక్తులు ఉన్న ఈ రోజుల్లో సుమారు 15000 విలువ చేసే మొబైల్ లభించినప్పటికీ దానిని నిజాయితీగా మళ్లీ ఆ వ్యక్తికి అందజేయడం గొప్ప



విషయమని పలువురు శ్రీనును అభినందించారు. అభినందించినవారిలో కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం, అధ్యాపకులు ఉన్నారు.

# మిథిలా నగర్‌లో రూ. 40 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్(వెలుతురు ప్రతినిధి) జూలై 15:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మిథిలా నగర్‌లో ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్ల అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం (సీఎంసీ) నిధుల నుంచి రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో రోడ్ నెం.8 (వాటర్ ట్యాంక్ ఎదురుగా) రోడ్ నెం.14 (నారాయణ స్కూల్ ఎదురుగా) రోడ్ల అభివృద్ధి చేపట్టనున్నారు.ఈ నిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషి ఫలితంగా మంజూరైనట్లు స్థానికులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈకార్యక్రమంలో మహాదేవపురం అధ్యక్షులు సిద్ధనొళ్ల సంజీవరెడ్డి, బహదురుపల్లి అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, మిథిలా నగర్ కల్చరల్ అసోసియేషన్ (MCA) సభ్యులు కృష్ణా రెడ్డి, ప్రవీణ్ జడ్డూ, జనార్ధన్ రెడ్డి, శివాజీ, భీమేష్, ధనుంజయ్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, విజయ్ రెడ్డి, బజ్జీ, నాగరాజు, సురేష్, సాత్విక్, విజయ్, వాలి, దిలీప్, తిరుమల, రాజశేఖర్, వెంకటేశ్వర్లు రెడ్డి, సందీప్, సతీష్, గోనా రెడ్డి, సంతోష్, సుబ్బు, సురేంద్ర, వెంకట్ రావు తదితరులు, ఆర్.కె. టౌన్‌షిప్, మిథిలానగర్, శిల్పా లేఅవుట్ నివాసులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం శంకుస్థాపన



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 15:**

పల్లివాడ గ్రామంలో భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్లివాడ గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు ఉపసర్పంచ్ పావురాల మచ్చ గిరి మరియు స్థలదాత సయ్యద్ ఖాజా బాబు మరియు గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కడారి సత్తయ్య మరియు మాజీఉప సర్పంచ్ కల్లూరి నాగేష్ మరియు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మంద చంద్రయ్య యువజన సంఘం అధ్యక్షులు మల్లెపాక నరసింహ మరియు యువజన సంఘం పెద్దలు మేకల లచ్చయ్య మేడి మల్లేశం కర్రే స్వామి కర్రే శ్రీనివాసు మేకల లింగయ్య జనపాల లక్ష్మణ్ సింగపంగ నరసింహ జనపాల స్వామి మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది స్థలదాత సయ్యద్ కాజా బాబు కి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# మున్సిపల్ సిబ్బందికి యూనిఫామ్ లు అందజేత

**మోత్కూర్, జులై 15,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం లో బుధవారం మున్సిపల్ కౌన్సిలర్ మొగుళ్ళ అనురాధ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ సిబ్బందికి యూనిఫామ్ ను పంపిణీ చేశారు.

మున్సిపల్ సిబ్బందికి గ్లౌజులు, మాస్కులు, సబ్బులు పనిముట్లను కౌన్సిలర్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది తమ విధుల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దన్నారు.

వార్డులో పారిధుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ఏ.మహేష్, సిబ్బంది వెన్నెపూసల రమేష్, బాసాని లక్ష్మణ్, నల్ల శ్రీను, మాగి భిక్షం, చెడిపెల్లి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) రాష్ట్ర కార్యాలయం ప్రారంభం నేడు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 15:**






రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) హైదరాబాద్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్‌లోని బాలకృష్ణ హైస్కూల్ ఎదురుగా ఉన్న ప్లాట్ నెం.90లో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు రాందాస్ బండు అథవాలే ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు కాంబ్లే రాజేష్ ఆహ్వానం పలికారు. సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పార్టీ మరింత బలోపేతంగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం కండి..

- తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం ..
- తిమ్మాపూర్ అభివృద్ధి కోసం బీజేపీ కార్యాచరణ
- బిజెపి నేతలు రంగు భాస్కరాచారి, ఇనుగోండ నాగేశ్వర్ రెడ్డి...

**కరీంనగర్ వెలుతురు జూలై 15:**





ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ కూడా ప్రజలను వంచించే ఎజెండాతో పాలన సాగిస్తోందని, రెండు పార్టీలు ఒక్కటేనని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి ఘాటుగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తిమ్మాపూర్ మండల శాఖ అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కొత్తపల్లి లోని సాయిరాం గార్డెన్లో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రంగు భాస్కరాచారి , ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి లు మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండ గట్టడానికి , పోరాటానికి సిద్ధం కావాలని , కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. తిమ్మాపూర్ మండల కార్యవర్గ సమావేశం లో ప్రధానంగా తిమ్మాపూర్ మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ వరకు తిమ్మాపూర్ మండల అభివృద్ధిని అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా పట్టించుకోలేదని, నియోజకవర్గం దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టింది.

**తిమ్మాపూర్ మండల రాజకీయ తీర్మానం.. బీజేపీ ప్రధాన డిమాండ్లు**

తిమ్మాపూర్ మండలంలోనిఅన్ని గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన పంట కొనుగోలు కేంద్రాలను, అత్యాధునిక వసతులతో కూడిన మార్కెట్ యార్డును మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి.కూరగాయల సాగులో కోతుల బెడదను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, సబ్సిడీలను అందించాలి. ఎల్ఎండి పరిధిలోని ఫిలిగ్రీ ట్రైనింగ్ సెంటర్ ను వెంటనే వినియోగంలోకి తెచ్చి, కళాకారులకు ఉపాధి కల్పించాలి. సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా, పారదర్శకమైన ఇసుక పాలసీని తీసుకురావాలి. మండలంలోని అవసరాలకు రూ.1000 ధరకే ఇసుకను అందించాలి. ఎల్ఎండి కాలనీ సమీపంలో ఫిష్ మార్కెట్, చేపల నిల్వ కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి.ఎల్ఎండి కాలనీ పరిధిలోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు కేటాయించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించాలి. దశాబ్దాలుగా ఆగిపోయిన పవర్ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. లేనిపక్షంలో భూములను రైతులకు తిరిగి అప్పగించాలి. మండల ప్రజల మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి. ప్రమాదాలను నివారించేందుకు కరీంనగర్ హైదరాబాద్ రాజీవ్ రహదారిలో అలుగునూర్ నుండి గుండ్లపల్లి వరకు స్పీడ్ లిమిట్, స్టాపర్లు, మరియు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలి."గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది" అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామాల్లో నాణ్యమైన రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కేంద్ర నిధులు పుష్కలంగా అందుతున్నాయి. గ్రామాల్లో ఈజీఎస్ పథకం కింద మంజూరైన భారీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు నాయకులకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగడుతూ, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ తిమ్మాపూర్ మండల శాఖ కార్యాచరణ ఉండబోతుందని మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మాజీ మండలాధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి , జిల్లా ఈసీ మెంబర్ సంపత్, మండల ప్రధాన కార్యదర్శి జి.తిరుపతిరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ సౌజన్య కిషోర్, బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్ , ఎలుకపల్లి స్వామి, పటాకుల చొక్కయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్, జాడి రాజు, బోనాల మోహన్, ఓదెలు, కిన్నెర అనిల్, చింతం లక్ష్మణ్ ,ప్రదీప్ రెడ్డి, కన్నంసాయి కృష్ణ, అజయ్, ప్రేమ్ చంద్, రాఘవరెడ్డి, రామిడిమహేందర్ రెడ్డి, శ్రీను, సుగుణాకర్, ఓంకార్ , వెంకటేష్ , రాజు జక్కోజు అనిల్, సంపత్ , రాజు లతోపాటు బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు. బిజెపి నాయకుడు దరిపెల్లి సతీష్ కుటుంబాన్ని పరామర్శించిన తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు.బిజెపి నాయకుడు దరిపెల్లి సతీష్ కుమారుడు అజయ్ ఇటీవల మృత్యువాత చెందిన నేపథ్యంలో తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు బుధవారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇను గొండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ రావుల శంకర్ గౌడ్ బూత్ అధ్యక్షులు కామర వెంకటేష్ కందుకూరి ఈశ్వర చారి సుద గోని శ్రీనివాస్ కామెర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ నగరంలో రూ.1.5 కోట్ల రూపాయల తో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**47వ, 62వ డివిజన్లలో అభివృద్ధి పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారితో కలిసి భూమిపూజ**

**కరీంనగర్ వెలుతురు జూలై 15:**



నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 47వ, 62వ డివిజన్లలో UIDF నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారితో కలిసి శంకుస్థాపన చేశారు.ముందుగా 47వ డివిజన్ రామ్‌నగర్‌లోని సిద్ధార్థ స్కూల్ సమీపంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి–ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.అనంతరం 62వ డివిజన్‌లో శ్రీరామ బుక్ స్టాల్–ఆకుల శైలజ హాస్పిటల్ సమీపంలో UIDF నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, నగరంలో నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, 47వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ గాజా రమా శివరాం, 62వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, కార్పొరేటర్లు మాసం గణేష్, మేకల వెంకటేష్, KAPP చంద్ర, ఎన్నం లక్ష్మి ప్రకాష్, బండారి వేణు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారికి వినతి పత్రాన్ని అందించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు

- డిచ్ పిల్లి, తెలంగాణ విశ్వవిద్యాలయం

**డిచ్ పల్లి వెలుతురు జూలై 15:**



తెలంగాణ విశ్వవిద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించారు. పర్యటనలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఉన్న వివిధ అంశాల సమస్యలపై, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారికి, వినతి పత్రాన్ని అందజేశారు, ఎస్సీ , ఎస్టీ విద్యార్థులు. అలాగే విశ్వవిద్యాలయంలోని ఉన్న సమస్యలను పరిష్కారం చూపాలని విద్యార్థులు తెలియజేశారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని స్పందించారు. హాస్టల్లో హైజిన్ పెంచాలి, ఇంజనీరింగ్ కాలేజ్ లో రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయాలి, ప్రవేశాలు తగ్గుతున్నాయి అధికారులు దృష్టి సారించాలి, తరగతుల్లో నాణ్యత పెంచాలి, వివిధ సమస్యలను తెలియజేశారు. తెలుగు అధ్యయన శాఖ ఎస్సీ , ఎస్టీ విద్యార్థులు. రాజు, విజయ్, తిరుపతి, మురారి, తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో దుబ్బాక టాప్

- 82.67 శాతం ఎన్యూమరేషన్ పూర్తి
- సిద్దిపేట జిల్లాలో దుబ్బాకకు తొలి స్థానం
- మున్సిపాలిటీల్లోనూ టాప్‌లో నిలిచిన దుబ్బాక మున్సిపాలిటీ
- బీఎల్‌వోలు, అధికారులు, ప్రజాప్రతి నిధుల సమిష్టి కృషి ఫలితమని వెల్లడి
- అన్ని రాజకీయ పార్టీల సహకారంతో లక్ష్యం దిశగా ముందడుగు
- పల్లె వంశీ కృష్ణ గౌడ్

**దుబ్బాక వెలుతురు జూలై 15:**



సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దుబ్బాక నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు 82.67 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తవడంతో జిల్లాలో తొలి స్థానాన్ని దక్కించుకుంది.అలాగే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో దుబ్బాక మున్సిపాలిటీ కూడా అగ్రస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు.ఈ విజయానికి బీఎల్‌వోలు బీఎల్ఏ–02లు, ఎన్నికల అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమిష్టిగా కృషి చేయడమే కారణమని బీజేపీ దుబ్బాక నియోజకవర్గ సర్ సమన్వయకర్త పల్లె వంశీ కృష్ణ గౌడ్ తెలిపారు.

# వర్షాల కోసం జహీరాబాద్‌లో మూడు రోజుల పాటు నమాజ్‌ఎఇస్తిస్కా



- జూలై 18 నుంచి 20 వరకు ఈద్గాహ్ మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు...
- ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనాలని జమీయతుల్ ఉలమా వ హుఫ్ఫాజ్, ఈద్గాహ్ కమిటీ పిలుపు....

**జహీరాబాద్ వెలుతురు జూలై 15:**

వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో తగినంత వర్షాలు కురవకపోవడం, రైతులు తీవ్ర ఆందోళనకు గురికావడం, పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ ఈద్గాహ్ కమిటీ, జమీయతుల్ ఉలమా వ హుఫ్ఫాజ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నమాజ్–ఎ–ఇస్తిస్కా (వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థన) నిర్వహించనున్నట్లు ఈద్గాహ్ కమిటీ అధ్యక్షుడు ముఫ్తీ ఖలీల్ అహ్మద్ ఖాసిమీ ప్రకటించారు.బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూలై 18, 19, 20 తేదీల్లో (శనివారం, ఆదివారం, సోమవారం) జహీరాబాద్ ఈద్గాహ్ మైదానంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7.15 గంటల నుంచి 8.00 గంటల వరకు ప్రముఖ ఉలమాల ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని, అనంతరం ఉదయం 8 గంటలకు నమాజ్–ఎ–ఇస్తిస్కా, ఖుత్బా, వర్షాల కోసం సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తామని చెప్పారు.ప్రాంతంలో వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, చెరువులు, బావులు, ఇతర జలవనరులు క్రమంగా ఎండిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అల్లాహ్ వైపు తిరిగి పశ్చాత్తాపం, అధికంగా ఇస్తిగ్ఫార్ (క్షమాపణ ప్రార్థనలు), వినయంతో నమాజ్–ఎ–ఇస్తిస్కా నిర్వహించడం ఇస్లాం సంప్రదాయమని పేర్కొన్నారు.మూడు రోజుల కార్యక్రమంలో ప్రముఖ ఇస్లామిక్ పండితులు ప్రత్యేక ప్రసంగాలు, నమాజ్, ఖుత్బా, సామూహిక దువాలు నిర్వహించనున్నారు. జహీరాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల ముస్లింలు మూడు రోజులూ ఉదయం 7.15 గంటలకల్లా వుజూ చేసి ఈద్గాహ్ మైదానానికి చేరుకొని ప్రార్థనల్లో పాల్గొనాలని ఈద్గాహ్ కమిటీ విజ్ఞప్తి చేసింది.విలేకరుల సమావేశంలో ఈద్గాహ్ కమిటీ ఉపాధ్యక్షుడు ఇనాయత్ అలీ, మహ్మద్ మోయిజ్, కార్యదర్శి మహ్మద్ ముజాహిద్, ఖజాంచి మహ్మద్ వసీమ్, మాస్టర్ హుసాముద్దీన్, ఫసీయొద్దీన్, మహ్మద్ మొయిన్, ఫిరోజ్, మౌలానా అయూబ్ ఖాన్, సలీమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో భాగంగా 22వ డివిజన్‌లో ఉచిత మొక్కల పంపిణీ

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 15:**



వనమహోత్సవం సందర్భంగా కరీంనగర్ నగరంలోని 22వ డివిజన్ హిందూపురి కాలనీ సమీపంలో స్థానిక కార్పొరేటర్ బండ రమణ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారి అధ్యక్షతన డివిజన్ ప్రజలకు ఉచిత మొక్కలను పంపిణీ చేశారు.అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హిందూపురి కాలనీ కమిటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టు క్రెడిట్ మోదీదే.. రేవంత్‌కు కాదన్న రామచందర్‌రావు

- వరంగల్ ఎయిర్‌పోర్టుకు బాట వేసింది మోదీ ప్రభుత్వమేనని వ్యాఖ్య.
- ఉడాన్ పథకంలో భాగంగా వరంగల్‌కు ఆమోదం లభించిందన్న భాజపా.
- భూసేకరణ ఆలస్యం వల్లే నిర్మాణం జాప్యమైందని వెల్లడి.

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.మీడియాతో మాట్లాడుతూ ఆయన.. 2011లో రైట్స్ (RITES) సంస్థ దేశంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై నిర్వహించిన సాధ్యాసాధ్యాల అధ్యయనంలో వరంగల్, కడప ప్రాంతాలు చోటు దక్కించుకున్నాయని గుర్తు చేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉడాన్ (UDAN) పథకం ద్వారా దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయాన సేవలను విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.ఈ క్రమంలో దేశంలో కొత్తగా 88 విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, అందులో వరంగల్ ఎయిర్‌పోర్టు కూడా ఉందని చెప్పారు. అయితే భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతోనే వరంగల్ విమానాశ్రయ నిర్మాణం ఆలస్యమైందని పేర్కొన్నారు.వరంగల్‌కు విమానాశ్రయం వస్తోందంటే దానికి ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాలే కారణమని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై అనవసరంగా రాజకీయ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.అదే విధంగా, తెలంగాణలో మరో కీలక ప్రాజెక్టుగా ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు దిశగా కూడా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రామచందర్‌రావు వెల్లడించారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# మార్తన్ననగర్‌లో ఓటరు సర్వే ఫారాల స్వీకరణ కార్యక్రమం నిర్వహణ



**కొండాపూర్, వెలుతురు, జూలై 15:**

కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తన్ననగర్‌లో ప్రత్యేక ఓటరు సర్వే ఫారాల స్వీకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్తార్, ఖైరున్ బేగం, అఫ్రోజ్, మాజీ కార్పొరేటర్ అమిత్ పటేల్ ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి ఓటరు సర్వే ఫారాలను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, వివరాల సవరణ వంటి అంశాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావాలని వారు సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని తమ పూర్తి సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఓటరు సర్వే విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

# దేవాదాయ శాఖలో అసమానతలు లేవు: దేవాదాయ శాఖ కమీషనర్ హన్మంత రావు

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**



కాళేశ్వరంలో గత ఆరు నెలల నుండి కొందరు స్థానిక బ్రాహ్మణులు ఇతర బ్రాహ్మణత్వం కలిగిన సామాజిక వర్గాలను పవిత్ర గోదావరి త్రివేణి సంగమంలో తమ తమ ఆచార వ్యవహారాలతో చేసుకుంటున్న కార్యక్రమాలను అడ్డుకోవడం,దాడులు దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఘటనలపై చర్యలు తీసుకుంటామని ఎటువంటి సామాజిక అసమానతలు దేవాదాయశాఖ లో లేవని. అన్ని సామాజిక వర్గాల సహకారంతోనే దేవాలయ వ్యవస్థ నిలబడి ఉందని అన్నారు.దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు తెలిపారు.బుధవారం హైదరాబాద్ బొగ్గులకుంట లోని రాష్ట్ర దేవాదాయశాఖ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ఆధ్వర్యం లోతెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అర్చక పౌరోహిత సంఘాల నాయకులు ఆయన్ని కలిసి కాళేశ్వరం లో జరుగుతున్న ఘటనలపై వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల నుండి కాళేశ్వరం లో జరుగుతున్న ఆచార వ్యవహారాలు అన్ని సామాజిక వర్గాల వారు యధావిధిగా జరుపుకోవచ్చునని ఎలాంటి వివక్షలు కానీ సామాజిక అసమానతలు కాని లేవని స్పష్టం చేశారు.అటువంటి సంఘటనలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అర్చక పౌరోహిత సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కారెంపూడి కృష్ణమూర్తి సహాయ కార్యదర్శి బ్రహ్మశ్రీ పత్తిపాక శేఖరా చార్యులు రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ఉపాధ్యక్షులు వీణవంక సదానందం కార్యదర్శి సిద్దోజు వీరన్న విశ్వ బ్రాహ్మణ అర్చక పౌరోహిత సంఘం నాయకులు దేవరకొండ అన్వేష్ శాస్త్రి గుండోజు ఏకాంబ్రశర్మ ఉప్పోజు సాయికుమారా చార్యులు బ్రహ్మశ్రీ బాలోజు పరిపూర్ణాచార్యులు పబ్బోజు రాజు ఆచార్యులు, పత్తిపాక రాఘవా చార్యులు తదితరులతో కూడిన ప్రతినిధుల బృందం ముందుగా రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు ను శ్యాలువాలతో వేదోక్త ఆశీర్వచనంతో సత్కరించారు.తెలంగాణా తొలి శాసన సభాపతి శాసన మండలి విపక్ష నేతసిరికొండ మధుసూదనా చారి ని కూడా కలిసారుబ్రాహ్మణ విశ్వకర్మ అర్చక పౌరోహిత స్వాముల పై కాళేశ్వరం లో జరుగుతున్న సంఘటనలు వివరించడం జరిగింది.స్పందించిన ఆయన దేవాదాయ కమిషనర్ హనుమంత రావు తో మాట్లాడి సమస్యలు సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రకృతి ప్రసాదించిన పవిత్ర నదీ జలాలు,సంగమాలు అనేవి అన్ని సామాజిక వర్గాలకు చెందినవనిఒక వర్గానికి చెందినవిగా కొందరు చేస్తున్న వాదనలు పసలేని వని ఇటువంటి సమస్యలు సమాజంలో తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రోడ్డు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల నేపథ్యంలో జూలై 16 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

**సైబరాబాద్ వెలుతురు జూలై 15:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వైశాలీనగర్ రైల్వే అండర్‌పాస్ వద్ద రోడ్డు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో 2026 జూలై 16 నుంచి 20 రోజుల పాటు అండర్‌పాస్‌ను పూర్తిగా మూసివేస్తున్నట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) శ్రీ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ తెలిపారు.వైశాలీనగర్ రైల్వే అండర్‌పాస్ ప్రస్తుతం ఇరుకుగా ఉండటంతో పాటు, భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిపోయి వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు అండర్‌పాస్‌ను విస్తరించడం, సమర్థవంతమైన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ వ్యవస్థను ఏర్పాటు చేయడం కోసం సంబంధిత సివిక్ అధికారులు పనులు చేపడుతున్నారు.ఈ పనుల నిర్వహణలో భాగంగా అండర్‌పాస్‌ను తాత్కాలికంగా మూసివేసి, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నట్లు తెలిపారు.

**ట్రాఫిక్ మళ్లింపు వివరాలు**

1. మై హోమ్ మంగళా నుంచి వైశాలీనగర్ అండర్‌పాస్ మీదుగా హఫీజ్‌పేట్ వెళ్లే వాహనాలు

మై హోమ్ మంగళా టీ–జంక్షన్ వద్ద యూ–టర్న్ తీసుకుని రాఘవేంద్ర నగర్ కాలనీ జంక్షన్ – హైటెన్షన్ రోడ్ – ఆర్టీఏ కార్యాలయం – కొండాపూర్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ మార్గంలో ప్రయాణించాలి.

2. తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ వైపు నుంచి వైశాలీనగర్ అండర్‌పాస్‌కు వచ్చే వాహనాలు

మై హోమ్ మంగళా టీ–జంక్షన్ – రాఘవేంద్ర నగర్ కాలనీ – హైటెన్షన్ రోడ్ – ఆర్టీఏ కార్యాలయం – కొండాపూర్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ/ఫ్లైఓవర్ మీదుగా హఫీజ్‌పేట్, ఆల్విన్ జంక్షన్ వైపు వెళ్లాలి.

3. హఫీజ్‌పేట్, ఆర్టీసీ కాలనీ, మై హోమ్ జువెల్ ప్రాంతాల నుంచి మై హోమ్ మంగళా వైపు వెళ్లే వాహనాలు

పైప్‌లైన్ రోడ్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ/ఫ్లైఓవర్ – జెన్‌పాక్ట్ వద్ద ఎడమ మలుపు – కొండాపూర్–ఆల్విన్ రోడ్ – ప్రభుత్వ పాఠశాల యూ–టర్న్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ ద్వారా ప్రయాణించాలి.

4. వాసవి లేక్ సిటీ, హఫీజ్‌పేట్ లేక్ ప్రాంతాల నుంచి మై హోమ్ మంగళా, రాఘవేంద్ర నగర్ వైపు వెళ్లే వాహనాలు

స్ప్రెర్ వన్ అపార్ట్‌మెంట్స్ యూ–టర్న్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ – జెన్‌పాక్ట్ వద్ద ఎడమ మలుపు – కొండాపూర్–ఆల్విన్ రోడ్ – ప్రభుత్వ పాఠశాల యూ–టర్న్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ ద్వారా ప్రయాణించాలి.

5. గోపాల్‌నగర్, కాల్వరీ టెంపుల్ ప్రాంతాల నుంచి మై హోమ్ మంగళా వెళ్లే వాహనాలు

హఫీజ్‌పేట్ అండర్‌పాస్/ఆర్‌ఓబీ వద్ద కుడివైపు తిరిగి కొండాపూర్–ఆల్విన్ రోడ్ – ప్రభుత్వ పాఠశాల యూ–టర్న్ – హఫీజ్‌పేట్ ఆర్‌ఓబీ మీదుగా కొండాపూర్, రాఘవేంద్ర నగర్ వైపు వెళ్లాలి.

ప్రజలు ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కోరారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనుల కారణంగా కలిగే తాత్కాలిక అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు.

# హైదరాబాద్ లో మజ్లిస్ అరాచకం

- **ఆటోపై హిందుత్వ నినాదం రాసుకున్నందుకు దౌర్జన్యం**
- **ఆటో టాప్ చింపేసి బూతులు తిట్టిన మజ్లిస్ గూండాలు**
- **అత్తాపూర్ పోలీసులు సైతం మజ్లిస్ నాయకులకు వత్తాసు**
- **హిందుత్వ నినాదం తొలగించకపోతే హైదరాబాద్ లో ఆటో నడపనీయబోమన్న ఎస్ఐ**
- **కేసు పెట్టి బొక్కలో వేస్తామంటూ దబాయింపు**
- **హిందుత్వ వాదులను కలిసి వాపోయిన భరత్**
- **భరత్ ను తీసుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన హిందుత్వ వాదులు**
- **అండగా ఉంటామని కేంద్ర మంత్రి హామీ**

**డ్యామేజ్ అయిన ఆటో స్థానంలో కొత్త ఆటో కొనిస్తానని భరోసా**

కరీంనగర్ వెలుతురు జూలై 15:

ఆటో పై హిందుత్వ నినాదాన్ని రాసుకోవడమే అతను చేసిన పాపం. బండ బూతులు తిడుతూ ఆటో కవర్ ను చించేయడమే కాకుండా పోలీసు అండతో భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన హైదరాబాద్ లోని మెహిదీపట్నంలో ఆలస్యంగా వెలుగు చేసింది. వివరాల్లోకి వెళితే... వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్ కుమార్(24) పొట్టకూటి కోసం హైదరాబాద్ కు వచ్చి ఆటో నడుపుతున్నాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. నెలలో 15 రోజులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. హైదరాబాద్ లో ఇల్లు లేకపోవడంతో ఆటో నడిపినన్ని రోజులు హైదరాబాద్ లోనే ఎక్కడో ఒక దగ్గర ఫుట్ పాత్ పైన, బస్టాండ్ వద్ద పడుకోవడం, తెల్లవారుజామున సులభ్ కాంప్లెక్స్ కు వెళ్లి స్నానపానాదులు పూర్తి చేసుకుని మళ్లీ ఆటోనడపడం, ఆ వచ్చిన డబ్బుతో ఊరికి వెళ్లి కుటుంబంతో జీవనం కొనసాగించడం భరత్ కు నిత్యక్రుత్యమైంది. భరత్ హిందుత్వ వాది. అందుకే ఆటో వెనుక కవర్ పై "Changing your religion is like your father (నీ మతాన్ని మార్చుకోవడం అంటే నీ తండ్రిని మార్చుకోవడం లాంటిది), Anyone born on this earth is a hindu... jai Sriram (ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ హిందువులే... జై శ్రీరామ్) అని నినాదాన్ని రాయించుకున్నారు.అయితే ఈనెల 13న భరత్ ప్యాసింజర్ ను ఎక్కించుకుని మెహిదీపట్నం నుండి జీడిమెట్లకు వెళుతుండగా మజ్లిస్ పార్టీకి చెందిన నలుగురు యువకులు ఆటోను వెంబడించారు. పిల్లర్ నెంబర్ 131 వద్ద అడ్డగించారు. బలవంతంగా భరత్ ను ఆటో నుండి దింపి.. 'ఆటో వెనుక ఏం రాసినవ్ రా... ఏమనుకుంటున్నవ్ రా...ఆ స్లోగన్స్ తీసేస్తావా? లేదా?'' అంటూ బండ బూతులు తిట్టడం ఆరంభించారు. నా ఆటో, నా ఇష్టం. నేను రాసిన దాంట్లో తప్పేముంది? అని అడిగితే... రాయలేని భాషలో పచ్చి బూతులు తిడుతూ ఆటో కవర్ వెనుకనున్న నినాదాలను గీకేశారు. ఆటో కవర్ ను చించి







వేశారు. మళ్లీ అట్లాంటి నినాదాలు రాస్తే... హైదరాబాద్ లో ఆటో కూడా తిరగనీయబోమని, చంపేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. మళ్లీ కాసేపటికే అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ వచ్చింది. ''నేను అత్తాపూర్ ఎస్ఐని (పేరు శ్రీనివాసులు) మాట్లాడుతున్నా. ఆటోమీద అట్లాంటి స్లోగన్స్ ఎట్లా రాస్తావ్? హైదరాబాద్ లో ఆటో తిరగాలని ఉందా? లేదా? వెంటనే స్టేషన్ కు రా. నీమీద కంప్లయింట్ వచ్చింది. రాకపోతే నీ ఆటోను సీజ్ చేస్తా''అంటూ బెదిరించారు.దీంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో పడిపోయిన భరత్ కు అక్కడున్న కొందరు హిందుత్వ వాదుల వద్దకు తీసుకెళ్లారు. విషయం విన్న వాళ్లు భరత్ కు అండగా నిలిచారు. అత్తాపూర్ పీఎస్ కు తీసుకెళ్లి స్థానిక సీఐకి జరిగిందంతా వివరించారు. ఎస్ఐ శ్రీనివాసులుపై చర్య తీసుకోవడంతోపాటు భరత్ ను బెదరించి ఆటో ను డ్యామేజ్ చేసిన మజ్లిస్ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదు ఇచ్చారు.అట్లాగే భరత్ ను వెంటబెట్టుకుని బుధవారం రోజున కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి వచ్చి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిశారు. జరిగిన విషయాన్ని వివరిస్తూ ఫోటోలు, వీడియోలు చూపించారు. భరత్ ద్వారా తెలుసుకున్న కేంద్ర మంత్రి ''బాధపడొద్దు. నేను అండగా ఉంటా''అని భరోసా ఇచ్చారు. హిందుత్వ సిద్ధాంతాన్ని నమ్మి ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నందుకు అభినందించారు. ఆటో కవర్ డ్యామేజ్ అయిందని భరత్ చెప్పడంతో పాత ఆటో స్థానంలో కొత్త ఆటో తీసుకోవాలని, అందుకయ్యే ఖర్చును తాను చెల్లిస్తానని హామీ ఇవ్వడంతోపాటు వెంటనే కొత్త ఆటో కొనిచ్చి అందుకయ్యే డబ్బు ఇవ్వాలని అక్కడే ఉన్న సిబ్బందిని ఆదేశించారు. భరత్ ను వేధించిన మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకునే అంశంపై హైదరాబాద్ సీపీతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

# విచ్చలవిడిగా ఇసుక మాఫియా

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న అక్రమ ఇసుక రవాణాని అరికట్టండి**
- **డిండి పరిసర ప్రాంతాల నుండి లోకల్ ఇసుక రవాణా ఓవర్‌లోడ్ పై చర్యలు తీసుకోవాలి**

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**



పెద్ద అంబర్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TGMDC) జనరల్ మేనేజర్ (GM) ఎల్లయ్య గారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, కర్నూలు ప్రాంతాల నుండి తెలంగాణలోకి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని, ఓవర్‌లోడ్ ఇసుక లారీలు రాష్ట్రంలో సంచరిస్తున్నాయని, అలాగే మహబూబ్‌నగర్ జిల్లా డిండి పరిసర ప్రాంతాల నుండి అవసరమైన అనుమతులు లేకుండా లోకల్ ఇసుక రవాణా జరుగుతోందనే సమాచారం తమకు అందిందని తెలిపారు. ఈ అంశాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా, ఇసుక ర్యాంపుల వద్ద కాంట్రాక్టర్లు ఒక్కో లారీకి రూ.2,500 నుండి రూ.3,000 వరకు లోడింగ్ అమౌంట్ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. TGMDC నిర్ణయించిన డీడీ (DD) మొత్తాన్ని చెల్లించిన తర్వాత కూడా అదనపు వసూళ్లు చేయడం వల్ల చట్టబద్ధంగా పనిచేస్తున్న లారీ యజమానులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ఇసుక రేట్లు లేకపోవడం, డీజిల్ ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు పెరగడం వల్ల లారీ యజమానులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్రమ వసూళ్లను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు, ఇసుక ర్యాంపులు మరియు ఇతర కీలక ప్రాంతాల్లో తనిఖీలను మరింత కట్టుదిట్టం చేసి, అక్రమ ఇసుక రవాణా, ఓవర్‌లోడ్ లారీలు, అనుమతులు లేని లోకల్ ఇసుక రవాణా మరియు అక్రమ లోడింగ్ వసూళ్లపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలినట్లయితే బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్ద అంబర్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ కోరింది.వినతిపత్రం సమర్పించిన వారిలో పెద్ద అంబర్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షులు మునుకుంట్ల బలరాం గౌడ్, పేదగోని నర్సింహా, అసోసియేషన్ సభ్యులు మునుకుంట్ల శ్రీను, బోయపల్లి ప్రవీణ్, ముక్కర్ల లింగస్వామి, వంటల గణేష్, శంకర్, వర్ధం లింగస్వామి, వంటల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 16 నుంచి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాలు

- **హైదరాబాద్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో 60 స్టాల్స్ లో అన్ని సంప్రదాయ చేతివృత్తుల ఉత్పత్తులు**
- **బోనాల మట్టి కుండల నుంచి పట్టుచీరల వరకు**
- **తయారీదారులు నుంచి నేరుగా వినియోగదారులకు**
- **చేతివృత్తులను ప్రోత్సహించాలి**
- **బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్.ఎ.సి), కమిషనర్ బాల మాయాదేవి**

**హైదరాబాద్, వెలుతురు జూలై 15:**

ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా జూలై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ (పెద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన)లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్.ఎ.సి) & కమిషనర్ బాల మాయాదేవి గారు తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.జులై 16 వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారు, బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, బీసీ సంక్షేమ శాఖ సలహాదారు శ్రీ వి.హెచ్. హనుమంతరావు గారు, అటవీ దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు, క్రీడా శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారు, ఎంపీ శ్రీ అనిల్ కుమార్ యాదవ్ గారు, స్థానిక ఎమ్మెల్యే శ్రీ దానం నాగేందర్ గారు మరియు ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె తెలిపారు. గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత , పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# దిల్‌సుఖ్‌నగర్‌లో ఘనంగా కుబేర సిల్క్స్ నాలుగో బ్రాంచ్ ప్రారంభం

**ఎల్బీనగర్, వెలుతురు జూలై 15:**

ఎల్బీనగర్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ ఎస్ఆర్ఆర్ కాంప్లెక్స్, కోణార్క్ థియేటర్ ఎదురుగా కుబేర సిల్క్స్ నాలుగో బ్రాంచ్‌ను సినీ నటి, వకీల్ సాబ్ చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ల ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అనన్య నాగళ్ల మాట్లాడుతూ, "ఇంత అందమైన వస్త్రాలయాన్ని ప్రారంభిస్తున్న యాజమాన్యానికి హృదయపూర్వక అభినందనలు. యువతతో పాటు మహిళలకు నాణ్యమైన, బ్రాండెడ్ వస్త్రాలను అందిస్తున్న కుబేర సిల్క్స్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు.కుబేర సిల్క్స్ నిర్వాహకులు ఎం. శ్యాంసుందర్ గుప్తా మాట్లాడుతూ, తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ముఖ్య అతిథులతో పాటు ఇతర అతిథులందరికీ స్వాగతం తెలిపారు. తమ వస్త్రాలయంలో రూ.5,000 నుంచి ప్రారంభమయ్యే డజన్ల కొద్దీ పట్టు చీరలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.అలాగే రూ.5,000కు పైగా చీరలు కొనుగోలు చేసిన వినియోగదారులకు 50 శాతం విలువైన చీరలను ఉచితంగా అందిస్తున్న ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించారు. పట్టు, బ్రైడల్, డిజైనర్ చీరలకు కుబేర సిల్క్స్ ఒకే చిరునామా అని తెలిపారు.



# ఏపీ ప్రగతి పథంలో మరో మైలురాయి

- కడపలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ
- రూ.3,100 కోట్ల ప్రాజెక్టుకు మంత్రి లోకేశ్ భూమిపూజ
- గత పాలనలో దెబ్బతిన్న 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్'
- రాష్ట్రాన్ని మళ్లీ నిలబెట్టేందుకు కష్టపడ్డామన్న మంత్రి
- ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- కొత్త ప్లాంట్ ద్వారా మరో 700 మందికి ఉద్యోగాలు
- ఆధునిక సాంకేతికతతో రోబో ల్యాబ్, కంట్రోల్ రూమ్
- ప్లాంట్ ప్రతినిధులు, కార్మికులతో లోకేశ ముచ్చట్లు
- సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం భారీగా పెంపు
- 9.6 మిలియన్ టన్నులకు చేరనున్న

**దాల్మియా రికార్డు**

**కడప వెలుతురు జూలై 15:**

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి సరికొత్త ఉత్తేజం లభించింది. కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు అధికారికంగా పునాదిరాయి పడింది. మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో దాల్మియా సిమెంట్ సంస్థ రూ.3,100 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేస్తున్న లైన్-2 (రెండో ప్లాంట్) విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ భారీ పారిశ్రామిక ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చడంతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని, దీనివల్ల 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పూర్తిగా దెబ్బతిన్నదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి, పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించడానికి గడిచిన రెండేళ్లుగా తాము అహర్నిశలు కష్టపడ్డామని చెప్పారు. పొరుగు రాష్ట్రాలతో తీవ్రంగా పోటీపడి మరీ ఏపీకి భారీ పరిశ్రమలు, పెట్టుబడులను తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున



ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ప్రస్తుతం నడుస్తున్న దాల్మియా మొదటి ప్లాంట్ ద్వారా ఇప్పటికే ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మంది జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. ఇప్పుడు ప్రారంభించిన రెండో ప్లాంట్ విస్తరణ పనుల వల్ల కొత్తగా మరో 700 మంది స్థానిక యువతకు నేరుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దీనికి తోడు అనుబంధ పరిశ్రమలు, వ్యాపారాల ద్వారా కూడా వందలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు.భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా మరియు కంపెనీ ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'రోబో ల్యాబ్', 'సెంట్రల్ కంట్రోల్ రూమ్'లను మంత్రి లోకేశ్ స్వయంగా సందర్శించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, ఆడియో విజువల్స్ వీక్షించిన అనంతరం స్థానిక కార్మికులను పలకరించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ వారితో కలిసి ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు.దేశంలోనే నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా పేరుగాంచిన దాల్మియా భారత్ గ్రూప్, ఏపీ అభివృద్ధిలో ఎప్పటి నుంచో కీలక భాగస్వామిగా ఉందని లోకేశ్ కొనియాడారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోంది. అయితే రూ.3,100 కోట్లతో చేపట్టనున్న ఈ సరికొత్త లైన్-2 విస్తరణ పనులు పూర్తయితే, క్లింకర్ ఉత్పత్తి సామర్థ్యం ఏకంగా 6.1 మిలియన్ టన్నులకు, మొత్తం సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 9.6 మిలియన్ టన్నులకు చేరి సరికొత్త రికార్డు సృష్టిస్తుందని అధికారులు వెల్లడించారు.దాల్మియా సంస్థ తన రెండో దశ విస్తరణ పనులను పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా, అత్యుత్తమ అంతర్జాతీయ ప్రమాణాలతో 'గ్రీన్ ఇండస్ట్రీ' (హరిత పరిశ్రమ)గా మార్చేందుకు కట్టుబడి ఉందని మేనేజ్మెంట్ స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఈ భారీ ఫ్యాక్టరీ నడవడానికి అవసరమైన మొత్తం విద్యుత్‌లో ఏకంగా 80 శాతం విద్యుత్‌ను కేవలం సౌర, పవన వంటి పునరుత్పాదక ఇంధన వనరుల (గ్రీన్ ఎనర్జీ) నుంచే సేకరించనున్నారు. ఇది పారిశ్రామిక రంగంలో పర్యావరణ పరిరక్షణకు ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలవనుంది.పరిశ్రమల వల్ల స్థానికంగా కాలుష్యం పెరగకుండా ఉండేందుకు దాల్మియా గ్రూప్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతోంది. గాలి కాలుష్యాన్ని పూర్తిగా అదుపు చేయడానికి ఏకంగా రూ.100 కోట్ల భారీ వ్యయంతో 130 హై-కెపాసిటీ బ్యాగ్ ఫిల్టర్లను అమరుస్తున్నారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు పోకుండా, నీటి వృథాను పూర్తిగా అరికట్టేందుకు 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో ఏకంగా 33 శాతం విస్తీర్ణంలో దట్టమైన మొక్కలతో గ్రీన్ బెల్ట్ (హరితహారం)ను అభివృద్ధి చేయనున్నారు.పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ అనుమతులను అత్యంత వేగంగా, పారదర్శకంగా ఇవ్వడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు ఈరోజు భారీగా పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం భారతదేశానికి వస్తున్న మొత్తం విదేశీ, స్వదేశీ పారిశ్రామిక పెట్టుబడులలో ఏకంగా 25 శాతం వాటాను ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే దక్కించుకోవడం మన పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు (గ్రోత్ రేట్) మునుపెన్నడూ లేని విధంగా 10 నుంచి 15 శాతానికి పెరిగిందని, భవిష్యత్తులో దాల్మియా సంస్థ మూడో దశ విస్తరణకు కూడా సిద్ధంగా ఉందని మంత్రి లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు.

# సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్

**సైబరాబాద్ వెలుతురు జూలై 15:**

సైబరాబాద్ ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే దిశగా చేపడుతున్న చర్యలను సమీక్షించేందుకు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్., ఈ రోజు సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (TTI)తో పాటు మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.మొదటగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలించిన జాయింట్ సీపీ, అక్కడ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ విధానం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాల గురించి ఇన్‌స్పెక్టర్ భరత్, ఎస్ఐ నర్సింహారెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణా విధానంలో నాణ్యతను మరింత పెంపొందిస్తూ, ట్రాఫిక్ నియమాల పట్ల ప్రజల్లో బాధ్యతాయుతమైన దృక్పథం ఏర్పడేలా కౌన్సిలింగ్ కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు.అనంతరం మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జాయింట్ సీపీ గారు, స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సిబ్బంది వివరాలు, ట్రాఫిక్ పాయింట్ల సంఖ్య, ప్రధాన కూడళ్లు, ముఖ్య రహదారులు, వీఐపీ మూమెంట్ జరిగే ప్రాంతాలు, అధిక రద్దీ ఉండే జంక్షన్లు, ట్రాఫిక్ నియంత్రణకు అమలు చేస్తున్న చర్యలపై SHO ఆరె శ్రీధర్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ పరిస్థితులు, సవాళ్లు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను SHO వివరించారు.ఈ సందర్భంగా జాయింట్ సీపీ ట్రాఫిక్ నిర్వహణలో



సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. రద్దీ ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సేవాభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్-1) జి. హనుమంతరావు గారు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. చంద్రశేఖర్ రెడ్డి గారు, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మరియు మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

- ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అధికారులు నిరంతరం సందర్శించాలి
- నాసిరకం సరుకులు సరఫరా చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతాం

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అని, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. పిల్లలకు పథకాలు అందించడం ఒక మెట్టు మాత్రమేనని... వారు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం, ఆరోగ్యంగా, హుషారుగా ఎదగడం, వారి మేధాశక్తి పెరగడం అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార సరఫరా, టేక్ హోమ్ రేషన్ (THR), అంగన్వాడీ తొలిముద్ద (బ్రేక్‌ఫాస్ట్ పథకం), అమ్మ మాట-అంగన్‌వాడీ బాట, నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, మౌలిక వసతులు, నియామకాలు, బాల్య వివాహాల నివారణ, శిశు రక్షణ, దత్తత ప్రక్రియతో పాటు వివిధ పథకాల బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ''మీ పిల్లలు, మనవరాళ్ల వయస్సు ఉన్న చిన్నారులే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. వారిని సొంత పిల్లలుగా భావించి సేవ చేయాలి. పిల్లలు అంగన్‌వాడీకి రావడం ఒక మెట్టు... వారు హుషారుగా, ఆరోగ్యంగా ఎదగడం మరో ఎత్తు. వారి మేధాశక్తిని పెంచేలా మన సేవలు ఉండాలి'' అని అధికారులకు సూచించారు.గతంలో ఉమ్మడి జిల్లాలు చాలా పెద్దగా ఉండేవని, ప్రస్తుతం చిన్న జిల్లాలు ఏర్పడినందున మారుమూల చివరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించేందుకు DWOలు, సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేయడం వల్ల మధ్యాహ్న భోజన నాణ్యత పెరిగినట్లే అంగన్‌వాడీల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు.గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి సీతక్క హెచ్చరించారు. నాసిరకం సరుకులు సరఫరా చేసినా సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. ''మీకు నాణ్యమైన సరుకులు రాకపోతే ముందుగానే మాకు రిపోర్ట్ చేయండి. పిల్లలకు క్వాలిటీ ఫుడ్ అందాలి. గర్భిణులు, బాలింతల విషయంలోనూ ఎలాంటి రాజీ ఉండదు. మంచి జరిగినా, లోపం ఉన్నా మీ అనుభవాలను మాకు తెలియజేయండి. వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తాం'' అని తెలిపారు.ఒకటి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆయా వార్తలపై జిల్లా అధికారులు వెంటనే సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. శాఖ పరిధిలో మహిళలు, పిల్లలకు సంబంధించి ఏదైనా తీవ్రమైన ఘటన జరిగినా తక్షణమే ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సమాచారం అందించాలని స్పష్టం చేశారు.పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల చిన్నారుల హాజరు పెరగడంతో పాటు వారి అభ్యాస సామర్థ్యం కూడా మెరుగుపడుతోందన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.''అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'' కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య ఎంత మేర పెరిగిందో జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పాలు అందించడం వంటి నూతన కార్యక్రమాల ఫలితాలను కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు.ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. భూమి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌ల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే మంజూరైన భవనాలను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఒకేసారి ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.నూతన అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు మానసిక ఆహ్లాదాన్ని కలిగించే రంగులతో ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, పైప్‌లైన్ నీటి కనెక్షన్ వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద



మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.వలస కార్మికుల పిల్లల కోసం కార్మిక శాఖ సహకారంతో మొబైల్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ అవసరమైన మొబైల్ అంగన్‌వాడీలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మారుమూల గుత్తికోయ గూడేల్లోని చిన్నారులకు కూడా పోషకాహారం, ఫీడింగ్ సేవలు పూర్తి స్థాయిలో అందాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్నారి ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదన్నారు.అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను చూసి చిన్నారులు నేర్చుకుంటారని, అందువల్ల సిబ్బంది ప్రవర్తన, క్రమశిక్షణ ఆదర్శంగా ఉండాలని మంత్రి సూచించారు. పిల్లలతో ఎలా మాట్లాడాలి, ఎలా మెలగాలి, వారి మానసిక వికాసానికి ఎలా తోడ్పడాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు రోజు వారి జీవితానికి అవసరమైన వివిధ అంశాలను పరిచయం చేస్తూ వారి మేధాశక్తి, గ్రహణశక్తి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.అంగన్‌వాడీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 12 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, ఒకటి రెండు రోజుల్లో మిగిలిన జిల్లాల్లోనూ నోటిఫికేషన్లు విడుదల చేయాలని సూచించారు. నియామకాలు ఎలాంటి వివాదాలకు తావులేకుండా, పూర్తి పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ సిబ్బందికి పిల్లలతో సున్నితంగా వ్యవహరించే మానసిక స్వభావం, మాతృత్వ భావన ఉన్నాయా అనే అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత తెలంగాణగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ''మన పరిధిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకూడదు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలి'' అని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# పదవీకాలం ముగిసిన లక్షెట్టిపేట, మంచిర్యాల మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గం నియామిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు మంత్రి తుమ్మల

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**




పదవీకాలం ముగిసిన లక్షెట్టిపేట, మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (AMC)లకి నూతన పాలకవర్గాలను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం రోజున ఉత్తర్వులు జారీ చేసిందని, నూతన పాలకవర్గానికి రెండేళ్ల పదవీకాలం ఉండనుందని మంత్రి తుమ్మల తెలియజేశారు. మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మరియు మంచిర్యాల మార్కెట్ కమిటీల తొలి పాలకవర్గాల పదవీకాలం ఇటీవల ముగిసింది. పదవీకాలం ముగిసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా నూతన పాలకవర్గాన్ని నియమించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు లక్షెట్టిపేట మార్కెట్ కమిటీకి చైర్మన్ గా శ్రీ అక్కల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ గా రాజేష్ మరియు మంచిర్యాల మార్కెట్ కమిటీకి చైర్మన్ గా శ్రీ రామగిరి బానేష్, వైస్ చైర్మన్ గా శ్రీ రాయలింగు గార్లని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు మార్కెట్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో పారదర్శకతను పెంపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మంత్రి తెలిపారు. మార్కెట్ కమిటీలు రైతులకు సేవలందించే కీలక వేదికలని, వాటి ద్వారా రైతులు తమ పంటలకు సరైన ధరలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.మంచిర్యాల మరియు లక్షెట్టిపేట మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాలు స్థానిక రైతుల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తూకం, నిల్వ, వేలం ప్రక్రియలలో పారదర్శకతను మరింత బలోపేతం చేస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, రైతులకు అంకిత భావంతో సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఈ నెల 17వ తేదీ నుండి 19వ తేదీ వరకుబిఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాలు

- బిఅర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 15:**



ఇబ్రహీంపట్నం బిఅర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ సమాజ సేవే మ హోన్నతం మీ ఆరోగ్యం మా బాధ్యత అనేలక్ష్యంతో బిఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులైన పయనీర్ హాస్పిటల్స్ రక్షేకేర్ హాస్పిటల్ మరియు సాధూరామ్ ఐ హా స్పిటల్స్ అనుభవజ్ఞులైన వైద్యుల సహకారంతో ఉచిత మెగావైద్యశిబిరాలు నిర్వహిస్తాం ఈశిబి రాల్లో సాధారణ వైద్య పరీక్షలు స్త్రీల ఆరోగ్య సంబంధిత పరీక్షలు పిల్లల వైద్యసేవలు ఆర్థోపెడిక్ వైద్య సేవలు నేత్ర పరీక్షలు రక్తదానశిబిరం ఉచిత కంటి పరీక్షలు మరియు అవసరమైన వారికి ఉచిత మందులు అందించబడతాయి ఈఉచిత వైద్య శిబిరాలు క్రింది తేదీలు మరియు ప్రదేశా ల్లో ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిర్వహించబడతాయి జూలై 17,2026 ఉప్పరిగూడ గ్రామపంచాయతీ ఆవరణలో జూలై 18, 20 26 ఇబ్రహీంపట్నం భరత్ గార్డెన్స్ జూలై 18, 2026 యాచారం గ్రామపంచాయతీ ఆవరణలోజూలై 19, 2026 రాక్కం సత్తి రెడ్డి గార్డె న్స్ తుర్కయాంజాల్ జూలై 19, 2026వై.ఎన్.ఆర్ గార్డెన్స్ అబ్దు ల్లాపూర్ మెట్ లోఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చే సుకోవాలని అన్నారు.

# తెలంగాణ ఎస్సీ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కేంద్రం అండగా నిలుస్తుందన్న కేంద్ర మంత్రి రాందాస్

- రూ.300 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ పై కేంద్ర మంత్రి కి విజ్ఞప్తి చేసిన సంక్షేమ మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, వెలుతురు జూలై 15:**

తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధుల నుంచి తక్షణమే రూ.150 కోట్ల విడుదలకు సానుకూలంగా స్పందించినట్లు, అలాగే షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి ప్రతిపాదించిన రూ.300 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై వచ్చే నెలలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.హైదరాబాద్ పర్యటనలో భాగంగా బుధవారం టూరిజం ప్లాజాలో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలేను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, సంక్షేమ విద్యాసంస్థల ఆధునీకరణ, కేంద్ర ప్రాయోజిత పథకాల సమర్థ అమలుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా తీసుకుని షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి అనేక విప్లవాత్మక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విద్యనే సామాజిక సాధికారతకు ప్రధాన ఆయుధంగా భావిస్తూ గురుకుల విద్యా వ్యవస్థ, సంక్షేమ హాస్టళ్లు, విద్యార్థుల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడం, 16 సంవత్సరాల తర్వాత కాస్మెటిక్ ఛార్జీలను 212 శాతం పెంచడం, హాస్టళ్ల నిర్వహణకు భారీగా నిధులు విడుదల చేయడం, ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం, ఆధునిక విద్యా అవకాశాలను విస్తరించడం వంటి పలు కీలక నిర్ణయాలు తీసుకుందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు సంక్షేమ విద్యాసంస్థల ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద తెలంగాణకు రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉండటం వల్ల సంక్షేమ కార్యక్రమాల అమలుపై అదనపు ఆర్థిక భారం పడుతోందని మంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.అదే విధంగా రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో భవనాల మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, హాస్టళ్ల విస్తరణ, డైనింగ్ హాళ్లు, ఆధునిక వంటశాలలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సురక్షిత తాగునీటి సదుపాయాలు, ప్రహరీ గోడలు, విద్యు



ద్దీకరణ, డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, స్మార్ట్ లెర్నింగ్ సదుపాయాల కల్పన అత్యవసరమని వివరించారు.ఈ నేపథ్యంలో తెలంగాణలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల సమగ్ర ఆధునీకరణ కోసం రూ.300 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రత్యేక నిధులతో విద్యార్థులకు మరింత సురక్షితమైన, ఆధునికమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు విద్యా ఫలితాలను మరింత మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వసతి, సామాజిక సాధికారత రంగాల్లో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నిరంతర సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరాలంటే కేంద్ర ఆర్థిక సహకారం అత్యంత అవసరమని వివరించారు.మంత్రి సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర మంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే సానుకూలంగా స్పందించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. తెలంగాణకు రావాల్సిన పెండింగ్ కేంద్ర నిధుల్లో తొలి విడతగా రూ.150 కోట్లను తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని, అలాగే రూ.300 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రతిపాదనపై వచ్చే నెలలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.అదేవిధంగా షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి, విద్యా అభివృద్ధి, సామాజిక సాధికారత కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. అలాగే ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని కూడా కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఎస్సీ కార్పొరేషన్ GM హనుమంత్ నాయక్, మల్లయ్య భట్టు VC &MD ఎస్సీ, బీసీ కార్పొరేషన్, ఎస్సీ స్టడీ సెంటర్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, TGSWREIS జాయింట్ సెక్రెటరీ అడ్మిన్ సక్రు నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సత్యనారాయణ తో పాటు వివిధ సంక్షేమ శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ ప్రకృతి.. పర్యావరణ పరిరక్షణలో గురుకుల విద్యార్థులు ఆదర్శం

- ప్రకృతిని కాపాడే బాధ్యత ప్రతి విద్యార్థి తీసుకోవాలి – సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- WWF-ఇండియా – TGSWREIS సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ ప్రకృతి అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహణ

**హైదరాబాద్, వెలుతురు జూలై 15:**







భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని పర్యావరణాన్ని అందించాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణపై అవగాహన, బాధ్యత పెంపొందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రకృతిని కాపాడే ఉద్యమంలో గురుకుల విద్యార్థులు ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.బుధవారం హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (TGSWREIS) ప్రధాన కార్యాలయంలో WWF-ఇండియా, హైదరాబాద్ కార్యాలయం మరియు TGSWREIS సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ ప్రకృతి అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... ఉత్తమ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థి ప్రకృతి మిత్రులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించేందుకు HYDRAA ద్వారా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించడం, నగర పర్యావరణ సమతుల్యతను కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని మంత్రి అన్నారు. మొక్కలు నాటడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం, నీటి వనరులను సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు.గురుకుల విద్యార్థులు విద్యలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలోనూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని మంత్రి అభినందించారు. మిషన్ ప్రకృతి వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మిషన్ ప్రకృతి కార్యక్రమం సాధించిన విజయాలను నిర్వాహకులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 238 టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ గురుకుల విద్యాసంస్థలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనగా, 1,478 మంది నేచర్ క్లబ్ సభ్యులు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పరోక్షంగా 1.75 లక్షలకు పైగా విద్యార్థులకు పర్యావరణ అవగాహన కల్పించబడింది.అలాగే 470 మందికి పైగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయగా, ప్రతి పాఠశాలలో క్యాంపస్ బయోడైవర్సిటీ రిజిస్టర్లు రూపొందించారు. పౌర విజ్ఞాన (Citizen Science) కార్యక్రమాల ద్వారా వేల సంఖ్యలో జీవవైవిధ్య పరిశీలనలను నమోదు చేశారు. నేచర్ క్లబ్‌లు, గ్రీన్ క్యాబినెట్లు, జీవవైవిధ్య మ్యాపింగ్, పర్యావరణ అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేశారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థి ప్రకృతి మిత్రులను మంత్రి సత్కరించి అభినందించారు.మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... "విద్యార్థులకు పుస్తక విజ్ఞానంతో పాటు ప్రకృతి విజ్ఞానం కూడా ఎంతో అవసరం. పర్యావరణ పరిరక్షణను జీవన విధానంగా అలవరచుకున్నప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రతి గురుకుల విద్యార్థి ప్రకృతికి రాయబారిగా మారాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను హరిత, పరిశుభ్ర, పర్యావరణహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది" అని అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన WWF-ఇండియా, TGSWREIS, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాలంటీర్లు, భాగస్వామ్య సంస్థలకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మిషన్ ప్రకృతి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించి జీవవైవిధ్య పరిరక్షణను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సందర్భంగా WWF-ఇండియా ట్రస్టీ & WWF-ఇండియా హైదరాబాద్ కార్యాలయ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ శ్రీ అనిల్ కుమార్ వి. ఎపూర్ మాట్లాడుతూ, "మిషన్ ప్రకృతి కేవలం ఒక కార్యక్రమం కాదు, భవిష్యత్ తరాల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే ప్రజా ఉద్యమం. విద్యార్థులు ప్రకృతిని అర్థం చేసుకుని, జీవవైవిధ్య పరిరక్షణలో నాయకత్వం వహిస్తే తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. WWF-ఇండియా ఈ దిశగా ప్రభుత్వంతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కట్టుబడి ఉంది" అని అన్నారు.WWF-ఇండియా హైదరాబాద్ కార్యాలయ అడ్వైజరీ బోర్డు సభ్యురాలు శ్రీమతి వనితా దాట్ల మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి పర్యావరణ హిత కార్యక్రమాల్లో భాగస్వామి కావాలి. మార్పు కోసం ఎదురు చూడకుండా, మార్పుకు నాయకత్వం వహించాలి. తెలంగాణను పర్యావరణ అవగాహన కలిగిన (Eco-literate) రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలి. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ సమాజానికి, ప్రకృతికి సేవ చేయాలి" అని సూచించారు.WWF-ఇండియా, హైదరాబాద్ కార్యాలయం రాష్ట్ర డైరెక్టర్ శ్రీమతి ఫరీదా టంపాల్ మాట్లాడుతూ... మిషన్ ప్రకృతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (TGSWREIS), ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు భాగస్వామ్య సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.


పర్యావరణ విద్య, జీవవైవిధ్య పరిరక్షణ, పౌర విజ్ఞాన కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం WWF-ఇండియా ప్రధాన లక్ష్యమని, మిషన్ ప్రకృతి ద్వారా వేలాది మంది విద్యార్థులు ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలోTGSWREIS జాయింట్ సెక్రెటరీ అడ్మిన్ సక్రు నాయక్,WWF-ఇండియా, హైదరాబాద్ కార్యాలయం సిబ్బంది శ్రీ పి.ఎస్.ఎం. శ్రీనివాస్, శ్రీ ఎం.ఎస్. తిరుమలేశ్వరరావు, శ్రీ మహేందర్ మరియు శ్రీ ఎస్.ఎం. అక్బర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాల కోలాహలం

**విజయవాడ వెలుతురు జూలై 15:**

విజయవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి భక్తుల జయజయ ధ్వానాలతో మారుమోగుతోంది. కోట్లాది మంది పౌరులకు కొండంత అండగా నిలిచే జగన్మాత, భక్తజన కల్పవల్లి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో ఆషాఢ మాస సారె మహోత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల ప్రారంభంతో ఇంద్రకీలాద్రి అంతటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంగా మారింది.హిందూ సంప్రదాయంలో, ముఖ్యంగా తెలుగువారి సంస్కృతిలో ఆషాఢ మాసానికి ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. పెళ్లయిన తమ కన్నకూతురిని ఆప్యాయంగా పుట్టింటికి పిలిచి పసుపు, కుంకుమ, బట్టలు పెట్టి సారె ఇవ్వడం మన ఇళ్లల్లో తరతరాలుగా వస్తున్న ఆచారం. అదే రీతిలో లోకమాత అయిన దుర్గమ్మను తమ ఇంటి ఆడపడుచుగా భావించి, భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు సమర్పించుకునే అపురూప ఘట్టమే ఈ 'ఆషాఢ సారె' మహోత్సవం. నెల రోజుల పాటు నిరంతరాయంగా సాగే ఈ వేడుకలో లోకపావనికి పట్టుచీరలు, గాజులు, పండ్లు, నోరూరించే పిండివంటలను భక్తులు కానుకగా సమర్పిస్తారు.ఆషాఢ మాస ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై ఘనంగా ఏర్పాట్లు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, డోలు సన్నాయిల నడుమ ఆలయ అర్చకులు తమ కుటుంబ సమేతంగా అమ్మవారికి తొలి అధికారిక సారెను సమర్పించారు. అనంతరం సాధారణ భక్తులు ఘాట్‌రోడ్డులోని ప్రసిద్ధ 'ఓం మలుపు' ప్రాంతం నుంచి పాదయాత్రగా నడుచుకుంటూ, తలపై సుమంగళ ద్రవ్యాల గంపలను మోస్తూ జగన్మాత సన్నిధికి చేరుకున్నారు. అంతరాలయంలో కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకుని తమ తెచ్చిన కానుకలను సమర్పించి పులకించిపోయారు.ఆషాఢ మాస సారె ఉత్సవాల ప్రారంభంతో పాటే ఇంద్రకీలాద్రిపై మరో అత్యంత విశేషమైన ఆధ్యాత్మిక క్రతువుకు శ్రీకారం చుట్టారు. నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు అమ్మవారికి అత్యంత శక్తివంతమైన "వారాహి నవరాత్రి" పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ పది రోజుల పాటు అమ్మవారి మూలవిరాట్టుకు మరియు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరుగుతాయి.

# విద్యను వ్యాపారంగా మార్చిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది: టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్









**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

హైదరాబాద్ బోయినపల్లిలో నిర్వహించిన "ఛత్రోంకి గూంజ్" కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చిందని తీవ్రంగా విమర్శించారు. ఉద్యోగ, విద్యా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని అన్నారు. ఇన్ని ఆరోపణలు, ఆధారాలు వెలుగులోకి వచ్చినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని, ఆయనపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మరింత బాధాకరమని విమర్శించారు.విద్యార్థుల హక్కులను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా "ఛత్రోంకి గూంజ్" కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు."నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. దేశ విద్యా వ్యవస్థను రక్షించేందుకు, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు జరుగుతున్న ఈ ఉద్యమానికి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

ఆషాఢ మాసం తొలి రోజున తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎంబి కృష్ణ యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు, అధికారులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, డి రవీందర్ యాదవ్, డి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# హైదర్‌గూడ డివిజన్‌లో విజయవంతంగా 15వ రోజుకు చేరిన 'ప్రత్యేక ఓటరు సమీక్ష' (SIR)

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు సమీక్ష (SIR) ప్రక్రియ, హైదర్‌గూడ డివిజన్ వ్యాప్తంగా బిజెపి సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి గారి అద్భుత సారథ్యంలో బుధవారం రోజుతో విజయవంతంగా 15వ రోజుకు చేరుకుంది. ఓటర్ల వివరాల నమోదు, తప్పుల సవరణే ధ్యేయంగా బీజేపీ సైనికులు నిర్విరామంగా శ్రమిస్తున్నారు.ఈ మహాయజ్ఞంలో బొక్క బాల్ రెడ్డి గారితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలైన గోనే శ్రీకాంత్ రెడ్డి, పవన్ పల్లుచెరువు, నరేందర్, భూపాల్ ముదిరాజ్, కర్ణాకర్, రాజశేఖర్, మనోజ్, చిన్న మనోజ్, పెద్ద మనోజ్ ,నవీన్ మరియు అనేకమంది బీజేపీ కార్యకర్తలు, బీఎల్‌ఓలు (BLO) భాగస్వాములై విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారు.

**ఓటర్ల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ సదుపాయం:**

ఇంకా ఎవరైనా ఓటరు నమోదు లేదా సవరణ ఫారమ్‌లు తీసుకోకపోతే, నిరాశ చెందాల్సిన అవసరం లేదు. హైదర్‌గూడ డివిజన్ పరిధిలోని కాలనీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు విల్లాస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు గేటెడ్ కమ్యూనిటీల ప్రతినిధులు ఎవరైనా సరే మా హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే... మా బీజేపీ కార్యకర్తలే స్వయంగా మీ వద్దకు వచ్చి ఫారమ్‌లను అందజేస్తారు. అంతేకాదు,



మీ వద్దే ఆ ఫారమ్‌లను పూర్తి చేయించి, తిరిగి తామే స్వయంగా సేకరించి సబ్మిట్ చేస్తారు. **ముఖ్య గమనిక:**

హైదర్‌గూడ డివిజన్ పరిధిలో మీరు ఎక్కడ ఉన్నా సరే... మా హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయండి. మేమే ఫారమ్‌లు ఇప్పిస్తాం, తీసుకుంటాం మరియు నింపి కూడా ఇస్తాం!ఈ తప్పులు అస్సలు చేయకండి:

ఆగస్టు 3వ తేదీ వరకు సమయం ఉంది కదా అని నిర్లక్ష్యంతో చివరి నిమిషం దాకా ఆగవద్దు.మా సేవా సైనికులు ఉప్పర్‌పల్లి బీజేపీ ఆఫీస్ నందు, వివిధ బూత్‌లలో ప్రతిరోజూ ఉదయం 9:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు నిరంతరం మీ కోసమే అందుబాటులో ఉన్నారు. దేశం కోసం... వన్ నేషన్ – వన్ ఓట్ కోసం... మన ఓటును కాపాడుకుందాం! సదా మీ సేవలో భారతీయ జనతా పార్టీ (BJP) భారత్ మాతాకీ జై! శ్రీరామ్!

# కన్నెపల్లి పంపులు... కల్వకుంట్లోళ్ల కట్టుకథలు

కొన్ని వాస్తవాలు చెప్పకపోతే... కట్టుకథలే అసలు నిజాలుగా చలామణీ అవుతాయి. అందుకే వాస్తవాన్ని చెప్పడం ఎప్పుడైనా అనివార్యం. అవశ్యం. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే నోరు విప్పాల్సిన సందర్భమని నాకు అనిపిస్తోంది. అందుకే, ఈ ఎడిటోరియల్ రాయాలనిపించింది. అదేంటి అంటే గులాబీ పార్టీ కాళేశ్వరం, కన్నెపల్లి పంపుల గురించి ప్రచారం చేస్తున్న కట్టుకథలు. పిట్టకథలు, పితురు చెప్పేవారికి కట్టుకథలు చెప్పడం సామాన్యమైంది. అందుకే ఈ రోజు వారి కట్టుకథలు ఏంటో బహిర్గతం చేయాలని అనిపించింది. గోదావరిలో వరద నీరు కనిపించగానే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపులను వెంటనే నడపాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. వినడానికి ఆ వాదన ఆకర్షణీయంగానే అనిపిస్తున్నా.. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. నదిలో ప్రవాహం కనిపించడం ఒక విషయం అయితే.. పంపులు పనిచేయడానికి అవసరమైన నీటిమట్టం ఉండడం మరో విషయం. కన్నెపల్లి పంపులు ఆన్ చేయకపోతే పంటలు ఎండిపోతాయని, ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుందని, తెలంగాణ చీకట్లో మునిగిపోతుందని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమో ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రశ్నిస్తూ ఈ కాలమ్ రాస్తున్నాను.నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు 2019 జూన్ 21న ప్రారంభమైంది. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో మొత్తం వ్యవస్థకు గట్టి దెబ్బ తగిలింది. దాదాపు లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టు... కోట్లాది ప్రజలకు అప్పనంగా తినడానికే సరిపోయింది. ఇక మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల మీదుగా ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోసే వ్యవస్థ కేవలం నాలుగేళ్లు మాత్రమే పనిచేసింది. ఆ తర్వాత కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్ నిలిచిపోయింది. అయినప్పటికీ రైతులకు నీటి కొరత ఏర్పడలేదు. సాగు పూర్తిగా ఆగిపోలేదు. తాగునీటి సరఫరా నిలిచిపోలేదు. విద్యుత్ ఉత్పత్తి కూడా ఆగిపోలేదు. దీనికి ప్రధాన కారణం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిగా కాళేశ్వరం మీద ఆధారపడకపోవడమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే గోదావరి నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీరాంసాగర్ దిగువ నుంచి వచ్చే గోదావరి ప్రవాహం, కడెం ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీరు, ఎస్సారెస్పీ నుంచి ఎల్లంపల్లి వరకు దాదాపు పది వేల చదరపు కిలోమీటర్ల పరివాహక ప్రాంతంలో కురిసే వర్షాలే ఈ జలాశయానికి ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. మేడిగడ్డ నుంచి నీటిని తిరిగి ఎత్తిపోసే కాళేశ్వరం వ్యవస్థ అదనపు వనరుగా మాత్రమే ఉపయోగపడుతుంది. ఎల్లంపల్లి జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ఇందులో 62 రేడియల్ గేట్లు ఉన్నాయి. గత పన్నెండేళ్ల రికార్డులను పరిశీలిస్తే కాళేశ్వరం ఉండకముందు కూడా, తర్వాత కూడా ఎల్లంపల్లి వరద నీటితో పలుమార్లు నిండింది. 2016 నుంచి ఇప్పటివరకు కనీసం 13 సార్లు గేట్లు ఎత్తాల్సి వచ్చింది. ఈ వాస్తవాలను చూస్తే ఎల్లంపల్లి నిండాలంటే తప్పనిసరిగా కన్నెపల్లి పంపులు నడవాలన్న వాదనకు ఆధారాలు కనిపించవు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తకపోతే ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుందని కూడా కొందరు చెబుతున్నారు. కానీ అది కూడా వాస్తవాలకు దూరంగానే ఉంది. ఎల్లంపల్లి జలాశయంలోని డెడ్ స్టోరేజ్ నుంచి కూడా ఎన్‌టీపీసీకి అవసరమైన నీటిని లిఫ్ట్ చేసి నిల్వ చేసుకునే సదుపాయం ఉంది. 2023 అక్టోబర్ నుంచి కాళేశ్వరం పంపులు నిలిచిపోయినా ఎన్‌టీపీసీ ఒక్కరోజు కూడా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయలేదు. హైదరాబాద్‌కు ఎల్లంపల్లి నుంచి తాగునీటి సరఫరా కూడా ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగింది. ఈ పరిస్థితులు చూస్తే ప్రజలను భయపెట్టే ప్రచారానికి బలం కనిపించదు. కన్నెపల్లి వద్ద నీటిని నిల్వ చేయకపోతే పంటలు ఎండిపోతాయని చెప్పడం కూడా వాస్తవ పరిస్థితికి సరిపోదు. ఎందుకంటే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద నేరుగా సాగునీరు అందుకునే ఆయకట్టు లేదు. ఇప్పుడు కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తితే అది వెంటనే ఏ రైతు పొలానికి చేరుతుందో స్పష్టంగా చెప్పగల పరిస్థితి కూడా లేదు. అందుకే ఈ ప్రచారాన్ని రైతులు కూడా ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కాళేశ్వరం పనిచేయకపోతే ఉత్తర తెలంగాణలో వ్యవసాయం దెబ్బతింటుందని కూడా ప్రచారం చేస్తున్నారు. కానీ అధికారిక గణాంకాలు అందుకు భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. 2023–24లో రాష్ట్రంలో వానాకాలం, యాసంగి కలిపి 118.11 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 2024–25లో అది 127.04 లక్షల ఎకరాలకు పెరిగింది. 2025–26లో మరోసారి పెరిగి 129.80 లక్షల ఎకరాలకు చేరింది. అంటే మేడిగడ్డ కుంగిపోయిన తర్వాత కూడా వరి సాగు తగ్గకుండా మరింత పెరిగింది. వరి సాగు పెరగడానికి కేవలం కాళేశ్వరం ఒక్కటే కారణమని చెప్పడం సరైన విశ్లేషణ కాదు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్, వేల సంఖ్యలో బోర్లు, భూగర్భ జలాలు, పాత సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, వర్షపాతం, మార్కెట్‌లో లభించిన ప్రోత్సాహకాలు వంటి అనేక అంశాలు కలిసి వ్యవసాయానికి తోడ్పడుతున్నాయి. అందువల్ల సాగు విస్తీర్ణం పెరిగిన ప్రతిసారి మొత్తం క్రెడిట్‌ను ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే ఆపాదించడం వాస్తవాలను విస్మరించినట్లే అవుతుంది.అసలు నీటి పారుదల రంగమే ఎవరికీ అర్థం కాని ఒక సంక్లిష్టమైన అంశం. అందుకే ఈ విషయంలో ఎక్కువ సార్లు ఏం చెబితే అదే నిజంగా చలామణి అవుతుంది. అందుకే ఒకవైపు డ్రామారావు, మరొకవైపు అగ్గిపెట్టె హరీష్ రావు ఒకరిని మించి మరొకరు పోటీ పడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న చర్చలో మరో ముఖ్యమైన అంశం సాంకేతిక వాస్తవాలు. గోదావరిలో నీరు కనిపించిందని పంపులు వెంటనే నడపలేరు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు పనిచేయాలంటే మేడిగడ్డ బ్యారేజీ వద్ద కనీసం 93.50 మీటర్ల నీటిమట్టం ఉండాలి. ఆ స్థాయికి నీరు చేరినప్పుడే 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంపులు నీటిని సమర్థంగా ఎత్తిపోసే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జూలై 11న మేడిగడ్డ వద్ద నీటిమట్టం 89.90 మీటర్లు మాత్రమే నమోదైంది. జూలై 13న అది మరింత తగ్గి 89.30 మీటర్లకు చేరింది. అంటే పంపులు నడవడానికి అవసరమైన స్థాయి కంటే మూడు నుంచి నాలుగు మీటర్లు తక్కువగా ఉంది. అదే సమయంలో గోదావరిలో ప్రవాహం కూడా వేగంగా తగ్గింది. జూలై 11న 63 వేల క్యూసెక్కులుగా ఉన్న ప్రవాహం, రెండు రోజులకే 28 వేల క్యూసెక్కులకు పడిపోయింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గితే ప్రాణహిత ప్రవాహం కూడా వెంటనే తగ్గిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో బ్యారేజీలో నీటిని నిల్వ చేయకుండా కేవలం ప్రవాహాన్ని చూసి పంపులు నడపాలనుకోవడం ఆచరణ సాధ్యం కాదు. ఇక్కడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేవనెత్తిన ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. గోదావరిలో పారుతున్న నీటినే నేరుగా ఎత్తిపోసే అవకాశం ఉంటే, మేడిగడ్డ బ్యారేజీని వేల కోట్ల రూపాయలతో ఎందుకు నిర్మించాల్సి వచ్చిందనే ప్రశ్నకు ఇప్పటివరకు ఎవరూ సాంకేతికంగా వివరణ ఇవ్వలేదు. బ్యారేజీ నిర్మాణం వెనుక ఉన్న అసలు ఉద్దేశమే అవసరమైన నీటిమట్టాన్ని నిల్వ చేయడమే. రిటైర్డ్ ఇంజినీర్ల అంచనా ప్రకారం కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని అన్ని పంపులు ఒకేసారి 24 గంటల పాటు నిరంతరంగా పనిచేస్తే రెండు నుంచి మూడు టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం అక్కడి పరిస్థితి గతంలా లేదు. మేడిగడ్డ ఘటన తర్వాత పంప్‌హౌస్ సామర్థ్యం, యంత్రాల స్థితి, అన్ని పంపులు ఒకేసారి పనిచేసే పరిస్థితి ఉందా లేదా అనే అంశాలపై స్పష్టత అవసరం ఉంది. ఒకవేళ కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తినా అది నేరుగా ఎల్లంపల్లికి చేరదు. ముందుగా అన్నారం బ్యారేజీకి చేరాలి. అక్కడి నుంచి సుందిళ్లకు వెళ్లాలి. ఈ రెండు దశల్లోనూ నీటిని నిల్వ చేసి, మళ్లీ పంపింగ్ చేసిన తర్వాతే ఎల్లంపల్లికి చేరుతుంది. కాబట్టి ఇది ఒకే దశలో పూర్తయ్యే ప్రక్రియ కాదు. ప్రతి దశలో నీటి లభ్యత, నిల్వ సామర్థ్యం, పంపింగ్ పరిస్థితులు అనుకూలంగా ఉండాల్సి ఉంటుంది. ఇప్పటికే జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ మూడు బ్యారేజీల్లో నిర్మాణపరమైన సమస్యలు ఉన్నాయని పేర్కొంది. అలాంటి పరిస్థితుల్లో ఎన్‌డీఎస్‌ఏ లేదా కేంద్ర జల సంఘం అనుమతులు లేకుండా ఈ బ్యారేజీలను పూర్తిస్థాయిలో నిర్వహించడం సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. ప్రాణహితలో భారీ వరద ప్రవాహం ఉన్నప్పుడు కొంత మేర పంపింగ్ చేసే అవకాశం ఉండవచ్చు. కానీ ఆ వరద ఎంతసేపు కొనసాగుతుంది? ఎత్తిపోసిన నీటిని అన్నారం, సుందిళ్లలో ఎలా నిల్వ చేస్తారు? గేట్లు తెరిచి ఉంటే నీరు ఎలా ఆగుతుంది? గేట్లు మూసే పరిస్థితి ఉందా? అనే ప్రశ్నలకు కూడా స్పష్టమైన సాంకేతిక సమాధానాలు అవసరం ఉన్నాయి. ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాల్సిన బాధ్యత నిపుణులపైనే ఉంది. గతంలో మేడిగడ్డ నిర్మాణాన్ని తప్పుబట్టిన కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు ఇప్పుడు అదే వ్యవస్థ ద్వారా నీటిని ఎత్తాలని సూచించడం కూడా చర్చకు దారితీస్తోంది. ఎన్‌డీఎస్‌ఏ అనుమతులు లేకుండానే బ్యారేజీలను నిర్వహించాలని ఎందుకు కోరుతున్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేసిన నాలుగేళ్లలో మేడిగడ్డ నుంచి 163 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అందులో 63 టీఎంసీల నీటిని తిరిగి దిగువకు విడుదల చేయాల్సి వచ్చినా, మిడ్‌మానేరు, అనంతసాగర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వంటి జలాశయాల్లో నీటిని నిల్వ చేయగలిగారు. దాంతో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగింది. రైతుల బోర్లు, బావుల్లో నీటి లభ్యత కూడా మెరుగుపడింది. ఈ పరిమిత ప్రయోజనాలను ఎవరూ తిరస్కరించలేరు. అదే సమయంలో మరో వాస్తవాన్ని కూడా విస్మరించలేం. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ భారీ ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ కేవలం నాలుగేళ్లకే దెబ్బతినడం అత్యంత తీవ్రమైన వైఫల్యంగా మిగిలిపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించామని చెప్పుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, అదే ప్రాజెక్టులో జరిగిన ఈ లోపానికి కూడా బాధ్యత వహించాల్సిందే. విజయాన్ని మాత్రమే తమ ఖాతాలో వేసుకుని, వైఫల్యాన్ని మాత్రం పక్కన పెట్టడం ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదు. కాళేశ్వరం భవిష్యత్తుపై నిర్ణయాలు రాజకీయ నినాదాల ఆధారంగా కాకుండా సాంకేతిక నివేదికలు, భద్రతా ప్రమాణాలు, నీటి లభ్యత, రైతుల అవసరాలు, ప్రజాధన పరిరక్షణ వంటి అంశాల ఆధారంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలకు వాస్తవాలు చెప్పడం ప్రభుత్వాల బాధ్యత అయితే, వాస్తవాలను అంగీకరించడం ప్రతిపక్షాల బాధ్యత. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల విషయంలో భావోద్వేగాల కంటే శాస్త్రీయ దృక్పథానికే ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే, భావోద్వేగాలు రగిల్చి దాని ఆధారంగా రాజకీయం పబ్బం గడుపుకునే ఒక ముఠా మనకు తెరపైకి ప్రధానంగా కనిపిస్తుంది. ఆ ముఠాను గోలుసులతో బంధించి... మరొక ఫాంహౌసులో నిలువరించాల్సిన అనివార్యత ఉందని గుర్తు చేస్తున్న.



**సత్తు మల్లేష్,**
**కరీంనగర్ గ్రంథాలయ కమిటీ చైర్మన్.**

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పొడిగింపు

- **ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కొనసాగనున్నట్లు ప్రకటన.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 15:**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (Special Intensive Revision – SIR) కార్యక్రమానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు గడువును పొడిగించింది. తొలుత నిర్ణయించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను ఆగస్టు 3 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది.ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా షెడ్యూల్ ప్రకారం, ఆగస్టు 3 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరిస్తారు. అలాగే ఓటర్లు స్వయంగా కూడా తమ వివరాలను సమర్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు నమోదు చేసుకోని అర్హులైన పౌరులు, 18 సంవత్సరాలు నిండిన యువత, చిరునామా మార్చుకున్న వారు, పేర్లు లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### ఆగస్టు 10న ముసాయిదా జాబితా

గడువు ముగిసిన అనంతరం ఎన్నికల అధికారులు అందిన దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. ఈ ముసాయిదా జాబితాలో కొత్తగా నమోదు చేసిన పేర్లు, తొలగించిన పేర్లు, సవరించిన వివరాలు ప్రతిబింబిస్తాయి. దీంతో ఓటర్లు తమ వివరాలను మరోసారి పరిశీలించుకునే అవకాశం లభిస్తుంది.

### అభ్యంతరాలకు నెలరోజుల గడువు

ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, సూచనలు, సవరణల కోసం దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ కాలంలో ఓటర్లు తమ పేరు జాబితాలో లేకపోయినా, తప్పుగా నమోదైనా, మరణించిన వ్యక్తుల పేర్లు కొనసాగుతున్నా లేదా ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్నా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.కొత్తగా ఓటు హక్కు పొందిన వారు కూడా ఈ దశలో తమ పేర్లను చేర్చుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం ఇందుకు అవసరమైన ఫారాలు, ఆన్‌లైన్ సేవలను కూడా అందుబాటులో ఉంచనుంది.

### అక్టోబర్ 8లోపు విచారణ పూర్తి

అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఎన్నికల అధికారులు ప్రతి దరఖాస్తును పరిశీలించి, అవసరమైతే సంబంధిత వ్యక్తులను విచారణకు పిలుస్తారు. అన్ని అభ్యంతరాలపై అక్టోబర్ 8లోపు విచారణ పూర్తి చేసి నిర్ణయాలు తీసుకోవాలని ఈసీఐ రాష్ట్ర ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించింది. అనంతరం అన్ని సవరణలను పొందుపరిచి తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.

### ప్రత్యేక సమగ్ర సవరణ ఎందుకు?

ప్రతి ఎన్నికకు ముందు ఓటర్ల జాబితా పూర్తిగా ఖచ్చితంగా ఉండేలా ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతుంది. కాలక్రమేణా కొత్త ఓటర్లు చేరడం, కొందరు ఇతర ప్రాంతాలకు మారడం, మరికొందరు మరణించడం వంటి కారణాలతో ఓటర్ల జాబితాలో మార్పులు చోటుచేసుకుంటాయి. వీటిని సరిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం.ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఉండకుండా చూడటం, నకిలీ నమోదులను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడి పేరును జాబితాలో చేర్చడం వంటి చర్యలు చేపడతారు.

### ఓటర్లు చేయాల్సినవి

ఈ గడువులోపు ప్రతి ఓటరు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. పేరు లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. అలాగే పేరు, వయస్సు, లింగం, చిరునామా వంటి వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సవరించుకోవచ్చు. వివాహం, ఉద్యోగం లేదా ఇతర కారణాలతో చిరునామా మారిన వారు కూడా తమ ఓటును కొత్త ప్రాంతానికి బదిలీ చేసుకునే అవకాశం ఉంది.

### బీఎల్‌వోల పాత్ర కీలకం

ఈ ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) కీలక పాత్ర పోషించనున్నారు. వారు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించడం, అవసరమైన ఫారాలను అందించడం,

ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రజలు బీఎల్‌వోలతో సహకరించి సరైన సమాచారం అందించాలని ఎన్నికల సంఘం కోరుతోంది.

## తెలంగాణలో పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి: సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ లేఖ

- **సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ.**

**వెలుతురు అమరావతి/హైదరాబాద్ జూలై 15:**

తెలంగాణలో చిన్నారులపై లైంగిక నేరాల నివారణకు పోక్సో (POCSO) చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల సంచలనం సృష్టించిన షాబాద్ హత్యల ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తన లేఖలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణను నిర్ణీత గడువులో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత చిన్నారులు, వారి కుటుంబాలకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు విచారణ సమయంలో ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా చూడాలని కోరారు.అలాగే, కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలు మాయం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, దర్యాప్తు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని


కోరారు.షాబాద్ ఘటనను ప్రస్తావించిన పవన్ కల్యాణ్.. ఈ కేసులో బాధితులను రక్షించడంలో పోలీసులు విఫలమయ్యారని పేర్కొన్నారు. పోక్సో కేసు నమోదై ఉన్నప్పటికీ నిందితుడికి బెయిల్ లభించడం కూడా వ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తోందన్నారు. ఈ ఘటనలో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదని అభిప్రాయపడ్డారు.

పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిందని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. చిన్నారుల భద్రత విషయంలో రాజీకి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని తన లేఖలో పేర్కొన్నారు.

## యువతకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ అమలు చేయలేదు: తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, వెలుతురు జూలై 15:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, అసెంబ్లీ బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న 'యువ సంగ్రామ సభ' ఏర్పాట్లను డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, భండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ నీళ్లు–నిధులు–నియామకాల నినాదంతో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని, మరికొన్ని నియామకాలు వివిధ కారణాలతో పెండింగ్‌లో నిలిచాయని చెప్పారు.2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంక గాంధీ సరూర్‌నగర్‌లో ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ ఆ హామీల అమలుకు చర్యలు కనిపించడం లేదని ఆరోపించారు.రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ఉద్యోగాల కోసం ఆందోళన చేపడుతున్న యువతపై అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలు చేయడం ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై యువత విశ్వాసం కోల్పోయిందన్నారు.

# ఐరాసలో సంస్కరణలు చేపట్టాల్సిందే

- భద్రతా మండలి పాత నిబంధనలపై భారత్ ఆగ్రహం
- అంతర్జాతీయ వేదికగా రాయబారి హరీశ్ పిలుపు
- ఐక్యరాజ్యసమితిలో సమగ్ర మార్పులకు భారత్ డిమాండ్
- బహుళపక్షవాదాన్ని బలోపేతం చేయాలన్న పర్వతనేని
- ప్రస్తుత ప్రపంచ వాస్తవాలను ప్రతిబింబించాలి
- జనరల్ అసెంబ్లీని పునరుజ్జీవింపజేయాలని భారత్ స్పష్టం
- ప్రపంచ దేశాల నమ్మకాన్ని కోల్పోతున్న భద్రతా మండలి
- అంతర్జాతీయ వివాదాల పరిష్కరనలో వైఫల్యంపై ఆందోళన

**ఢిల్లీ వెలుతురు జూలై 15:**

ప్రపంచ శాంతిని కాపాడేందుకు ఏర్పడిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రస్తుత భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మారాలంటే అందులో అత్యవసరంగా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని భారతదేశం గట్టిగా డిమాండ్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బహుళపక్ష సహకార వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేసింది. ఐరాస జనరల్ అసెంబ్లీ నిర్వహించిన ఒక అనధికారిక రౌండ్ టేబుల్ సమావేశంలో 'బహుళపక్షవాదాన్ని భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దడం' అనే ప్రధానాంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ కీలక భేటీలో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ పాల్గొని, సంస్కరణల ఆవశ్యకతపై భారతదేశం తరపున బలమైన వాదనను వినిపించారు.సమావేశంలో భారత రాయబారి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు సమకాలీన ప్రపంచ వాస్తవాలను ప్రతిబింబించినప్పుడే బహుళపక్షవాదానికి నిజమైన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కేవలం కొన్ని దేశాల ప్రయోజనాలకే పరిమితం కాకుండా, ఐరాస జనరల్ అసెంబ్లీని పూర్తిగా పునరుజ్జీవింపజేయాలని పిలుపునిచ్చారు. దీంతో పాటు ప్రపంచ దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాలలో సుస్థిర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో 'ఆర్థిక, సామాజిక మండలి' (ఈసీఓఎస్ఓసీ) కి మరింత బలమైన, కీలకమైన పాత్రను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం చెలరేగుతున్న యుద్ధాలు, తీవ్రమైన ఘర్షణలను నివారించడంలో లేదా వాటిలో అర్థవంతంగా జోక్యం చేసుకోలేకపోవడంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని పర్వతనేని హరీశ్ ఆరోపించారు. దీనివల్ల ఇటీవలి కాలంలో ప్రపంచ ప్రజల్లో ఐరాస పట్ల ఉన్న నమ్మకం మరియు సానుకూల అభిప్రాయం బాగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఐరాస భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) తన అసమర్థత వల్ల బాధితుల కష్టాలను అంతం చేయలేకపోతోందని, దీనివల్ల అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటం అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారిందని దుయ్యబట్టారు.భద్రతా మండలి పనితీరులో ఉన్న లోపాలన్నీ దాని పాత కాలపు పద్ధతుల నుంచే పుట్టుకొచ్చాయని రాయబారి హరీశ్ విశ్లేషించారు. 1940వ దశకంలో, అంటే దాదాపు ఎనభై ఏళ్ల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన పాత నిర్మాణం ఇప్పుడున్న ఆధునిక ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ఏమాత్రం సరిపోదని తేల్చి చెప్పారు. ప్రపంచం ఎంతో ముందుకు దూసుకెళ్తున్నా, భద్రతా మండలి మాత్రం పాత నిబంధనలకే పరిమితం కావడం వల్ల అంతర్జాతీయ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు లభించడం లేదని భారత్ తరపున స్పష్టం చేశారు.ఐరాసలో సంస్కరణల ప్రక్రియ నెమ్మదించడంపై భారత్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇప్పటివరకు జరిగిన అంతర-ప్రభుత్వ చర్చలు (ఐజీఎన్ ఫ్రేమ్‌వర్క్) కేవలం ముందుగా రాసిపెట్టుకున్న ప్రకటనలు చదవడానికే పరిమితమయ్యాయని హరీశ్ విమర్శించారు. సదరు ఫ్రేమ్‌వర్క్‌లోని కీలకమైన కార్యాచరణ అంశాలు ఏవీ క్షేత్రస్థాయిలో అమలు కాకుండా కేవలం కాగితాలకే పరిమితం కావడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఐజీఎన్ నిబంధనలపై భారత్‌కు అనేక తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా తాము ఈ ఒప్పందానికి ఎల్లప్పుడూ నిర్మాణాత్మక స్ఫూర్తితో మద్దతు ఇస్తున్నామని గుర్తు చేశారు.కేవలం రాజకీయ రంగంలోనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో కూడా అత్యవసరంగా సంస్కరణలు చేపట్టాలని పర్వతనేని హరీశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ వడ్డీతో, సులభంగా ఆర్థిక సహాయం అందడం చాలా ముఖ్యమన్నారు. ఈ సంస్థలు తమ మౌలిక సిద్ధాంతాలను కాపాడుకుంటూనే, మరింత ఎక్కువ దేశాలకు ప్రాతినిధ్యం వహించేలా ప్రజాస్వామ్యబద్ధంగా మరియు అభివృద్ధి ఆధారితంగా రూపాంతరం చెందాలని కోరారు.ప్రపంచ పాలనా సంస్థలలో అత్యవసర మార్పుల అవసరాన్ని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా ఇటీవలే ఒక కార్యక్రమంలో బలంగా ప్రస్తావించారు. ఐరాసలో సంస్కరణలు చేపట్టడం ఇప్పటికే చాలా ఆలస్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిని మరింత ప్రభావవంతంగా మార్చాలంటే అందులో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్యను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య వ్యవస్థలు పాత నిబంధనలతో నడుస్తున్నాయని, వీటిని పునర్నిర్మించకపోతే ఐక్యరాజ్యసమితి యొక్క విశ్వసనీయత భవిష్యత్తులో చాలా పరిమితంగా మారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలితో పాటు గ్లోబల్ గవర్నెన్స్ (ప్రపంచ పాలన) సంస్థలన్నింటిలో సంస్కరణలను విజయవంతంగా అమలు చేయడానికి చేసే ప్రతి ప్రాధాన్యత గల ప్రయత్నానికి భారతదేశం పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని రాయబారి హరీశ్ ప్రకటించారు. మానవాళి ప్రస్తుతం ఎదుర్కొంటున్న మరియు భవిష్యత్తులో ఎదుర్కోబోయే క్లిష్టమైన సవాళ్లను సమర్థవంతంగా ఢీకొట్టేలా ఐరాసను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలన్నింటిపై ఉందన్నారు. ఇందుకు అన్ని సభ్య దేశాలు తమ స్వార్థ రాజకీయాలను పక్కనబెట్టి ఐరాస బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని భారతదేశం పిలుపునిచ్చింది.

# ఆక్వా రంగంపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం

- సిండికేట్ల చేతుల్లో రైతులు నలిగిపోతున్నారు
- మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ధ్వజం
- సమస్యల సుడిగుండంలో ఆక్వా రంగం
- ఐదు లక్షల మంది జీవనోపాధిపై దెబ్బ
- అధికార పార్టీ సానుభూతిపరులదే సిండికేట్ రాజ్యం
- చంద్రబాబు హయాంలో దళారులకు పండగ
- ఫీడ్, సీడ్ ధరల పెంపుతో రైతులకు తీవ్ర అన్యాయం
- కేజీకి రూ.2 తగ్గించి చేతులు దులుపుకోవడంపై ఆగ్రహం

**అమరావతి వెలుతురు జూలై 15:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఆక్వా రంగం ప్రస్తుతం తీవ్రమైన సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోందని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులు, ఆ రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఒక ముఖ్యమైన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల మంది పరోక్షంగా, ప్రత్యక్షంగా జీవనోపాధి పొందుతున్న ఈ రంగాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం తన తప్పుడు విధానాలతో పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఆక్వా రైతులు ఇంతలా దీనావస్థలో ఉండి అల్లాడుతున్నా, ఈ ప్రభుత్వానికి కనీసం పట్టనట్లు 'దున్నపోతు మీద వాన పడినట్టు' వ్యవహరిస్తోందని జగన్ తీవ్రంగా మండిపడ్డారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అత్యంత సన్నిహితులు, సానుభూతిపరులే రాష్ట్రంలో ఒక పెద్ద సిండికేట్‌గా ఏర్పడ్డారని జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. ఈ దళారీ సిండికేట్ చేతుల్లోనే ఈరోజు రాష్ట్రపాలన నడుస్తోందని, వీరి దోపిడీ కారణంగానే సామాన్య ఆక్వా రైతులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఇలాంటి దోపిడీ సిండికేట్‌లకే పండగలా ఉంటుందని, కష్టపడి పంట పండించే రైతన్నలకు మాత్రం చివరకు కన్నీరే మిగులుతుందని ఆయన ఎద్దేవా చేశారు.ఆక్వా సాగుకు అత్యంత ముఖ్యమైన ఫీడ్, సీడ్ ధరలను ఈ దళారీ సిండికేట్లే ఇష్టానుసారంగా నిర్ణయిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నాయని జగన్ ఆరోపించారు. మార్కెట్లో ఫీడ్ ధరలను కేజీకి ఏకంగా రూ.14 నుంచి రూ.16 వరకు విపరీతంగా పెంచేసి, ఆ తర్వాత రైతుల నుంచి నిరసనలు వ్యక్తమవడంతో కేవలం రూ.2 మాత్రమే తగ్గించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని మండిపడ్డారు. ఈ రకమైన చర్యలు కష్టాల్లో ఉన్న ఆక్వా రైతులను దారుణంగా అవమానించడమేనని దుయ్యబట్టారు. పెట్టుబడులు పెరిగి, మద్దతు ధర లభించక రైతులు దివాలా తీసే పరిస్థితి వచ్చిందన్నారు.తమ వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వా సాగుదారులకు ప్రతి దశలోనూ అండగా నిలిచేందుకు 'అప్సడా' అనే ప్రత్యేక పటిష్టమైన వ్యవస్థను తీసుకువచ్చామని జగన్ గుర్తు చేశారు. దీని ద్వారా క్వాలిటీ లేని సీడ్, ఫీడ్ సమస్యలతో పాటు మార్కెటింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను తాము ఎప్పటికప్పుడు సమర్థవంతంగా పరిష్కరించామని చెప్పారు. కానీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆక్వా రంగానికి శ్రీరామరక్షగా ఉన్న 'అప్సడా'ను పూర్తిగా పక్కనబెట్టి, దానిని నిర్వీర్యం చేసేశారని తీవ్రంగా ధ్వజమెత్తారు.ఆక్వా రైతులకు నాణ్యమైన సేవలు, సాంకేతిక సాయం అందించడం కోసం తమ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 35 కీలక ప్రాంతాల్లో అత్యాధునిక 'ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను' ఏర్పాటు చేశామని జగన్ మోహన్ రెడ్డి వివరించారు. అలాగే గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) పరిధిలో ప్రత్యేకంగా ఫిషరీస్ అసిస్టెంట్‌లను నియమించి, రైతులకు సాగులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచామని చెప్పారు. ఈ ల్యాబ్‌ల ద్వారా ఉచితంగా నీటి పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఆక్వా రంగాన్ని లాభాల బాట పట్టించామని గుర్తు చేశారు.ఆక్వా రంగానికి మరింత సాంకేతిక బలాన్ని చేకూర్చాలనే ఉద్దేశంతో తాము నరసాపురంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫిషరీస్ యూనివర్సిటీని (మత్స్య విశ్వవిద్యాలయం) మంజూరు చేసి పనులు ప్రారంభించామని జగన్ చెప్పారు. అలాగే భీమవరం ప్రాంత ప్రజల కోసం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేశామన్నారు. అయితే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆ ఫిషరీస్ వర్సిటీతో పాటు భీమవరం మెడికల్ కాలేజీ పనులను కూడా పూర్తిగా నిలిపివేసిందని జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు.క్షేత్రస్థాయిలో ఆక్వా రైతులు పడుతున్న పాట్లు, ఆర్థిక ఇబ్బందులు తనకు పూర్తిగా తెలుసని జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

రైతులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ఆక్వా సాగుదారుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం జరిగే వరకు తమ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున బాధితుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమబాట పడతామని, ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన ఖచ్చితమైన హెచ్చరిక జారీ చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రజా వ్యతిరేక పాలనకు కాలం దగ్గర పడిందని, మరో మూడేళ్లలో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్సీపీ నేతృత్వంలోని రైతు ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాము మళ్లీ అధికార బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ఆక్వా రంగాన్ని పట్టి పీడిస్తున్న చంద్రబాబు సానుభూతిపరుల దళారీ సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పీకేస్తామని హెచ్చరించారు. ఆక్వా రైతులకు పూర్వ వైభవం తీసుకువస్తూ, 'అప్సడా' వ్యవస్థను మళ్లీ పూర్తి స్థాయిలో పునరుద్ధరించి అన్నదాతల ముఖంలో సంతోషాన్ని నింపుతామని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు.



# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్..

- పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు
- శాంతి చర్చలకు సహకరించకపోతే దాడులు మరింత తీవ్రం..
- పగటిపూటే ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు
- పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు.
- ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు.
- శాంతి చర్చలకు సహకరించకపోతే దాడులు తీవ్రతరం చేస్తామని ప్రకటన.

**వెలుతురు వాషింగ్టన్/టెహ్రాన్ జూలై 15**

: పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఇప్పటికే కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత ముదురుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు పరిస్థితిని మరింత వేడెక్కించాయి. శాంతి చర్చలకు ఇరాన్ సహకరించకపోతే వచ్చే వారం నుంచి సైనిక చర్యలను మరింత ఉధృతం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు.వైట్‌హౌస్‌లోని సిచువేషన్ రూమ్‌లో జాతీయ భద్రత, రక్షణ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇరాన్ వైఖరిలో మార్పు లేకుంటే అమెరికా మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే అమెరికా ఇరాన్‌పై మరో దఫా వైమానిక దాడులు ప్రారంభించింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) అధికారికంగా ప్రకటించింది. గత కొంతకాలంగా ఎక్కువగా రాత్రి వేళల్లోనే దాడులు నిర్వహించిన అమెరికా, ఈసారి పగటిపూటే దాడులు చేపట్టడం గమనార్హంగా మారింది.సెంట్కామ్ ప్రకారం, హర్మూజ్ జలసంధి పరిసర ప్రాంతాలు, ఇరాన్ తీర ప్రాంతాల్లోని టెహ్రాన్ సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లతో దాడులు నిర్వహించారు.

అలాగే ఇరాన్ రక్షణ వ్యవస్థ, క్షిపణి సామర్థ్యాలను బలహీనపరిచే ఉద్దేశంతో గ్రేటర్ తున్బ్ ద్వీపంలోని కీలక క్షిపణి స్థావరాలపై కూడా దాడులు చేసినట్లు వెల్లడించింది.హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన మార్గమని, అక్కడ ప్రయాణించే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా అడ్డుకోవడమే ఈ సైనిక చర్యల ప్రధాన ఉద్దేశమని అమెరికా స్పష్టం చేసింది. ఇందుకోసం ఇరాన్ నౌకాదళం, క్షిపణి వ్యవస్థలు, తీర ప్రాంత రక్షణ సామర్థ్యాలను దెబ్బతీయడంపై దృష్టి సారించినట్లు తెలిపింది.అమెరికా తాజా హెచ్చరికలు, వరుస వైమానిక దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. శాంతి చర్చలు ఫలించకపోతే ఈ ఘర్షణలు మరింత విస్తరించే ప్రమాదం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com